# బాలయోగి

(ఏడంకాల నాటకం)

బోయి భీమన్న

ప్రథమ ముద్రణ: 1964

ప్రతులు: 1000

ముద్రణ

శ్రీరామా పవర్ ప్రెస్

సికింద్రాబాదు

హక్కులు రచయితవి

వెల: రూ. 2.00

ప్రతులకు

సుఖేలా నికేతనం

92/2 ఆర్.టి. విజయనగర కాలనీ

హైదరాబాదు.

# నాటకం గురించి

కవి వలెనే, యోగి పుడతాడు.

కళ, రాజకీయం, వ్యాపారం, జ్ఞానం, యోగం ఏ రంగంలో నైనా సరే, మానవుడు విజయం సాధించాలంటే, అందుకు సంబంధించిన గుణం అతడి బీజంలోనే వుండక తప్పదు. మామిడి టెంక నుంచి మందార వృక్షం మొలవదు.

తన జీవ లక్షణానికి, మనోవైఖరికి అనుగుణమైన వృత్తిని ఎంచుకోగల ప్రజ్ఞావంతుడే -- తన శక్తికి తగిన విజయాన్ని సాధించగలుగుతాడు జీవితంలో.

పులిని చూచి నక్క వాతలు పెట్టుకోవడం నక్కను చూచి పులి కుక్క కూడ పారిపోవడం – ఈ రకం మనోవైఖరులు కల వాళ్ళే మానవులలో మెజారిటీ ! తాను పులో, నక్కో గుర్తించుకోగల వాడు నూటి కొక్కడు కూడా లేడు ! విధిని నిందించి, కర్మను తిట్టుకొని ఏం లాభం ?

సాధారణ వృత్తిరంగాల విషయంలో అసాధారణత అంత కొట్టవచ్చినట్టుగా కనిపించదు.

సంగీతం, సాహిత్యం, చిత్రశిల్పం, ప్రవక్తృత, నియంతృత, భక్తి, యోగం బహుశా, ఈఏడు విషయాలలోనూ మానవుని మహేశ్వరత్వం వైశాఖ మధ్యాహ్నంలా ప్రపంచాన్నే పాదాక్రాంతం చేసుకోగలదని నా విశ్వాసం.

ఈ ఏడు విషయాలలోను – బ్రహ్మానందాన్ని, బ్రహ్మానంద సబ్రహ్మచారిత్వాన్ని మానవుడికి ప్రసాదించగలవి రెండే యోగం, కవిత.

యోగం బ్రహ్మానంద ప్రదాయిని. అది సాక్షాత్తు పరబ్రహ్మ జీవ బ్రహ్మైక్య పారమ్యం!

కవిత కూడ అంతే !

యోగి, కవి ఈ ఇద్దరూ కారణ జన్ములు. అందుకోసం పుడతారు. సాధన ద్వారా ఏ మనిషైనా పొందగల లక్ష్యాలు కావు ఈ రెండూ !

ఇందుకు సాక్ష్యం మన చరిత్రే !

బాలయోగి కారణజన్ముడు.

అతడు పుట్టుకతోనే యోగి.

కుండలిని మేల్కొల్పడం కోసం నానా తంటాలు పడి, తీరా అది మేల్కొని కస్సు మన్నప్పుడు, ఏం చెయ్యాలో తెలియక, దాని కాటుకు ఆహుతై పోయిన అనేక మందిని గురించి నాకు తెలుసు. కవిని చూచి, వ్యామోహపడి, తాను కూడ కవిత్వం చెప్పి, సన్మానాలు పొందడానికి పూనుకునే పండితులవంటి వారు వాళ్ళు !

బాలయోగి మహాయోగి. అతని కుండలిని – బాల శివుణ్ణి చూచిన బాల వలె – దానంత అదే లేచి, తక్కిన ఏ మజిలీలోనూ ఆగకుండా, సరాసరి సహస్రారం చేరి, చిర వియోగ జనిత సమావేశంతో, పరమ శివుణ్ణి కౌగిలించుకొన్న చరిత్ర ముమ్మిడివరం బాలయోగిది.

రామకృష్ణ పరమహంస జీవిత చరిత్రను మించిన చరిత్ర ఇది!

ఈ పరమ సత్యాన్ని గుర్తించగలవాళ్ళు ఇద్దరే – ఇటు పామరు డనబడే పశుల కాపరి, అటు పండితు డనబడే ఐన్‌స్టీన్ మహావిజ్ఞాని!

అపర చాణక్య బిరుదాంకితులైన శ్రీ కళా వెంకటరావుగారు 1948 ప్రాంతంలో ఒకసారి నాతో ఇలా అన్నారు:

"ముమ్మిడివరం బాలయోగి గురించి నేను ఎన్నో పరిశీలనలు జరిపించాను. నాకు నమ్మకమైన వాళ్ళను నిఘా వుంచాను. ఇటు నా మిత్రులు, అటు ప్రభుత్వపు సిఐడీలు కూడా అతనిలో ఏ లోపాన్నీ కనిపెట్టలేకపోయారు. అతడి (బాలయోగి)లో ఏదో అతిలోక మహాత్మ్యం వుంది. హి ఈజ్ నాట్ ఎ హోక్స్ (He is not a hoax).

అటువంటి పరమేశ్వర స్వరూపుడైన బాలయోగి చుట్టూ నేను అల్లిన కథ ఈ నాటకం!

కట్టెదుట ఉన్న వాస్తవానికి దెబ్బ తగలకుండా, ఆధ్యాత్మిక సత్యాన్ని, నాటకీకరించి, పాత్రపోషణ చేసి చూపడం సులభం కాదు. అతి కష్టం కూడ ! ఈ నాటకం లోని నా ప్రతి కల్పనా -- భగవంతుడైన బాలయోగి నాచే చేయించిందే ! నేను కేవలం అతడి చేతిలో ఒక నిండు కలాన్ని మాత్రమే.

బ్రాకెట్లలో ఇచ్చిన వర్ణన అంతా పాత్రధారులకు డైరెక్షను మాత్రమే. రంగాలంకరణలో, నటనలో చూపలేని అంశాలను మైకు ద్వారా సదస్యులకు చెపుతూ పోవచ్చు. స్వప్నదృశ్యం కోసం జెండాలు, పంట తల్లి వగైరాలను ఉపయోగించుకోవచ్చు. ఆవును రంగంలో ప్రవేశపెట్టడం సాధ్యం కాకపోతే ఆవు బొమ్మతో (బొమ్మలో మనిషితో) ఫలితం సాధించవచ్చు. చివరి రంగంలో మరో బాలయోగి పాత్రను వాడుకోవచ్చు. నాగు పాత్రకు మంచి గుడ్డ బొమ్మనో, రబ్బరు బొమ్మనో వాడుకోవచ్చు.

బాలయోగి ఈ కాలానికే ఒక భగవత్ ప్రతీక. ఒక శివ సాక్షాత్కృతి.

పుట్టుక నుంచీ మానవ సేవా కార్యక్రమాన్ని చేపట్టి, అదే లక్ష్యంగా పురోగమిస్తున్న హరిజన నాయకుడు శ్రీ ఈలి వాడపల్లిగారు. ఈయన ఎంతటి పేదవాడో అంతటి దాత, బలిచక్రవర్తి ఉండి ఇచ్చాడు. లేకుండా కూడా ఇస్తాడీయన, వదాన్యుడు, త్యాగి, నిత్య సేవాతత్పరుడు. ప్రజాహృదయుడు. ప్రేమ సామ్రాట్టు. యోగనిష్ఠుడైన సుబ్బారావుకు బాలయోగి పేరిచ్చిన మహర్షి. ఇంతటి మహాత్ముడైన శ్రీ వాడపల్లి గారికి ఈ నాటకం అంకితం ఇస్తున్న నేను కూడ ధన్యుణ్ణి. భాగ్యవంతుణ్ణి !

ఈ నాటకం నేను వ్రాయడానికి కారణమైన ప్రఖ్యాత సినీవేత్త శ్రీ అనుమకొండ వారికీ, అడిగిన వెంటనే ముద్రించి పెట్టిన శ్రీ పబ్బా వారికీ కృతజ్ఞుణ్ణి.

మహాయోగులను ప్రపంచాని కవతరింప జేసిన బాలయోగి చిన బాలయోగుల తల్లిదండ్రులు సాక్షాత్తు జగత్పితృమూర్తులు. వారికి, వారి కుటుంబానికి నా నమస్సులు.

\- రచయిత

# అంకితం

## మహర్షి శ్రీ ఈలి వాడపల్లిగారికి

శ్రీ యీలి వాడపల్లి సుధీ !
మానవ
శ్రేయో మహా పయోధీ

వాల్మీకి ఊహలో
వ్యాసర్షి గీతలో
మెరిసిన మెరుపు నీవు !
విరిసిన మనిషి నీవు ! "శ్రీ"

సర్వం సహా చక్ర
చక్రవర్తినె కొన్న
వీరబాహుని వంశ
వీరాధి వీరుడా : "శ్రీ"

శ్రీరామ దాపు సు
గ్రీవునికి ప్రాపైన
అలమతంగుని తపః
ఫలమైన గుణనిధీ ! "శ్రీ"

హరిజనుడవై పుట్టి
హరి పథకమును పట్టి
నిరుపేద జనుల పె
న్నిధి వైన వరదుడా ! "శ్రీ"

బలి, శిబి, దధీచి ము
ఖ్యుల వదాన్యత యెల్ల
వాసనాగతి విరియు
వర పారిజాతమా ! "శ్రీ"

చిన్న పైసా యైన
చేత లేకుండినను
లక్షమందికి మహా
లక్ష్మి రూపము చూపు ! "శ్రీ"

స్వీయ కష్టముతో ప
రాయి సుఖములు పెంచు
నవ్య దీప జ్యోతి !
దివ్య భావ విభూతి ! "శ్రీ"

బాల బాలికలె నీ
బంగారు పంట !
అమృత విజ్ఞానమే
అతిథి నీ యింట ! "శ్రీ"

శివుడె మా బాలయో
గి వరేణ్యు డని చెప్పి,
శివరాత్రి ఫల మెల్ల
క్షితి కిచ్చిన మహర్షి ! "శ్రీ"

శంఖమే భార్యగా
జన్మ నందిన హరీ !
ప్రేమయే బిడ్డలుగ
పృథివి బుట్టిన సిరీ ! "శ్రీ"

బాలయోగి చరిత్ర
భవ్య నాటక మిదే,
కృతి పతివి కమ్ము ! నా
కును కృతార్థత నిమ్ము !

శ్రీ యాలి వాడపల్లి సుధీ !
మానవ
శ్రేయో మహోపయోధీ !

– బోయి భీమన్న
రసాలిని

❋ ❋ ❋

# బాలయోగి

అవతరణ 1930

తపః ప్రారంభం 1946

శివరాత్రి దర్శన ప్రారంభం 1949

## పాత్రలు

1. సుబ్బారావు : ముద్దుపేరు పండు, తర్వాత బాలయోగి. వయస్సు పన్నెండు.
2. పంటతల్లి : అలగాపరిపిల్ల. వయస్సు పది.
3. గంగయ్య : సుబ్బారావు తండ్రి, ఆధ్యాత్మికచింత కలవాడు. నిండైన విగ్రహం.
4. వెంకన్న సెట్టి : సుబ్బారావు ఖామందు, సంపన్నుడైన వ్యవసాయదారు. సౌమ్యుడైన మానవతావాది.
5. వెగ్రమ్మగారు : వెంకన్నసెట్టి భార్య, ఖచ్చితమైన వ్యవహార వాదిని.
6. వీరంబాబు : ఒక రైతు యువకుడు, అవేశపరుడు. ధర్మపక్షపాతి.
7. జెండాలు
8. దండాలు : అలగాపరులు.
9. పోతురాజు : బంగారంగారి పాలేరు. రౌడీ లక్షణాలు కలవాడు.
10. బంగారంగారు : మూఢాచార ప్రియుడైన శ్రీమంతుడు.
11. స్వాముల వారు : సర్వమానవ శ్రేయోవాది. వేదాంతి.
12. మాలక్ష్మి : ఆవు
13. నాగు : ఒక తెల్లత్రాచు
14. కథకుడు : మైకుద్వారాగాని, మరోవిధంగాగాని, మధ్య మధ్య కథను వివరించే వ్యక్తి.
15. ఆలాపన : తెరలోనుంచి పాటలు పాడే వ్యక్తే ఈ ఆలాపన కూడా చేయవచ్చు.
16. స్వప్న దృశ్యంలో : బాలకృష్ణార్జునులు.
17. అవసరాన్ని బట్టి కొందరు ప్రజలు

# బాలయోగి

## అంకం ఒకటి

(దృశ్యం - ముమ్మిడివరం పల్లె పొలాలు, తోటలు. తెర వెనుక నుంచి అతి తారా స్థాయిలో ఒక ఆలాపన - సాఖీ - వినిపిస్తూ వుంటుంది - ఓ, ఓహో- అంటూ. కథకుడు చేసే వర్ణనలకు అనుగుణంగా రంగాలంకరణ, ఆహార్యం, నటన వుంటై.)

### కథకుడు

పవిత్రమైన గౌతమీతీరప్రాంతం. కోనసీమ నడిబొడ్డు. ముమ్మిడివరం గ్రామం. కొబ్బరి తోటలు. పచ్చని పొలాలు. ఆషాఢారంభం. జ్యేష్ఠ ఎండలకు తపించిపోయిన భూమాత కడుపు చల్లగా - అప్పుడే వర్షాలు ప్రారంభమైనై. నేలంతా చిగిర్చి వర్షాదేవి నాట్యానికి పచ్చని రంగస్థలాన్ని అమర్చింది. కొంతకాలంగా ఎక్కడినుంచో వినవస్తున్న దివ్యాలాపనకు పరవశించి క్షేత్రలక్ష్మి శరీరం జలదరించిన పులకలవలె, చేలనిండా పచ్చిక రెప రెపలాడుతోంది. దూరంలో పశువులు మేస్తున్నై. వరినాట్లకోసం దంపదుక్కి ప్రారంభమైంది. పంటకాలువ కొత్త నీటితో పొంగిపారుతోంది. గట్టు మీద మామిడిచెట్టు కొమ్మల మీద నుంచి కాలువలోకి దూకుతూ పశుల గాపర్లు ఆడుకొంటున్నారు. వారిలో ఆడపిల్లలు కూడా వున్నారు. సాయం సమయం. సూర్యరశ్మి గోవులపైబడి, వాటి దోర రంగును పులుముకొంటున్నది. అలగాపర్లను ఆనందంలో ఓలలాడిస్తున్నది.

(అప్పుడు - ఆలాపన సాహితీరూపం ధరించగా, దాని కనుగుణంగా కోలాటం వేసుకుంటూ జెండాలు, దండాలు, పంటతల్లి, పోతురాజు వగైరా అలగాపర్లు, వీరంబాబు వంటి రైతు కుర్రవాళ్ళు ప్రవేశిస్తారు)

ఆలాపనపాట

ఓ ! ఓహో! ఓహోహో !
ఓహో ! ఓహోహో !
ఎవరవో ? ఎవరవో ? ఎవరవో ?
ఎవరవో ? నీ వెవరవో ?

కరుణతో వాత్సల్య మధువును
కురిసి దాహము తీర్చినావు !
నెరలు తీసిన నరుని గుండెల
చెరకు తోటలు పెంచినావు !

తండ్రివో ఈ ధరణి కంతకు ?
తల్లివో ఈ చల్లదనముకు ?
ఎవరవో నీ వెవరవో ?
ఎంత మంజుల మూర్తివో ?

(వాళ్ళంతా అలా కొంతసేపు ఆడి నిష్క్రమిస్తారు. తర్వాత మధ్య తెర లేస్తుంది. అదే దృశ్యం. సుబ్బారావు నిమీలిత నేత్రాలతో సంధ్యారాగాన్ని చూస్తూ, ఒక మైలురాయి మీద కూర్చుని వున్నాడు. మొలకు ఒక తువాలు చుట్టుకొని వున్నాడు. పేము జువ్వ లాంటి శరీరం. విశాలమైన కళ్ళు. కాలు మీద కాలు వేసుకొని కూర్చున్నాడు. పశువుల్ని కాసే వెదురుకర్ర (దూళ్ళకర్ర) భుజానికి ఆనివుంది. ప్రకృతిలో లీనమై వున్నాడతడు. అంతలో పంటతల్లి వగైరాలు బిలబిలమంటూ రంగంలో ప్రవేశించారు. సుబ్బారావు చుట్టూ చేరి ఆలాపనకు అనుగుణంగా ఆడసాగారు. ఇప్పుడు పాట పంటతల్లి పాడుతున్నది.

పంటతల్లి

కనుల లోపలి కాంతివో ?

కాంతి వెలుపలి శాంతివో ?

ఎవరవో నీ వెవరవో ?

ఎందుకని కనిపించవో ?

(అలా కొంతసేపు పాడిన తర్వాత –)

జెండాలు

ఎందుకు కనిపించడం లేదు ? వాడు మనకు కనిపిస్తూనే వున్నాడు. మనమే వాడిక్కనిపించడంలేదు.

పోతురాజు

నిద్రమొగం దద్దమ్మ !

దండాలు

ఓరి, నీ ! ఇంకా నిద్ర పో పోతూనే వున్నాడ్రా !

పంటతల్లి

నిద్ర కాదురా ! అది యోగనిద్ర ! కొత్తలంక యోగిని చూడలే ?

పోతురాజు

వాడి మొఖం నిద్ర. అదో జబ్బు.

వీరంబాబు

కొత్తలంక యోగిది యోగనిద్రేనట మరి ! మనకేం తెలుసుగాని, పదండ్రా ఇక !

జెండాలు

వాణ్ణి లేపి తీసుకురావే ! లంకతల్లి !

పోతురాజు

లేవకపోతే, ఈడ్చుకురావే, వెల్లుల్లి !

వీరంబాబు

కొంచెం నోరుమూసుకోరా, పోతురాజు !

దండాలు

దోమలురోయ్ ! దో దోమలు !

(అంతా ఒకవైపుకూ, వాళ్ళని ద్వేషించుకుంటూ పోతురాజు మరొకవైపుకూ నిష్క్రమిస్తారు.)

పంటతల్లి

ఒరే, పందూ ! చూడరా, ఆ·సూర్యుణ్ణి ! ముగ్గిన తాటి పండులా ఎలా పడిపోతున్నాడో ! (సుబ్బారావును కదుపుతుంది. అతడు కదలడు) పాపం ! సూర్యుడు! చీకట్లో ఎక్కడికి పోతాడో రోజూ ! ఎక్కడ గడుపుతాడో రాత్రులు! (సుబ్బారావును మళ్ళీ కదుపుతూ) ఒరే ! ఒరే ! (లాభం లేదన్నట్టు పెదవి విరిచి) సరే, కూర్చో. నీ ఇష్టం వచ్చినంతసేపు కూర్చో ! నాకేం ! కామందురాలి చేత దెబ్బలు తినేవాడివి నీవే! నాకేం ? నా దూడలు పోతున్నె !

(ఆమె నిష్క్రమిస్తుంది. అప్పుడు రెండో ప్రక్క నుంచి మాలక్ష్మి ప్రవేశిస్తుంది. ఇటూ అటూ చూస్తుంది. సుబ్బారావును సమీపించి జబ్బ నాకుతుంది. అతడు కళ్ళు తెరిచి చూస్తాడు. లేస్తాడు. ఆవు మీద చేయివేసుకొని నిష్క్రమిస్తాడు. తెరవాలుతూ వుండగా, అలాపన మళ్ళీ వినిపించి, అదే రాగంలో పద్యంగా వెలువడుతుంది)

లోపలినుంచి

ఎవర వందును నిన్ను ? ఈ భువుల తోడ
బొంగరము లాడుకొనుచున్న భూతనాథు ?
ఎవర వందును నిన్ను ? ఈ అవని మీద
బాల రూపము గొన్న గోపాలమూర్తి ?

# బాలయోగి

## అంకం రెండు

(దృశ్యం - వెంకన్న శెట్టిగారి లోగిలి. లోగిలికి ఆనుకొని పశువుల కొట్టం. అక్కడ - రంగం ముందు భాగంలో - ఒక ప్రక్క చేతిలో చీపురుకట్టతో, వెర్రమ్మగారు కోపంతో నిలబడివుంది. ఉగ్రకాళీ స్వరూపం. ఎవరినీ లక్ష్యపెట్టని స్వభావం. యథారీతిగా ఆలాపన రంగం ప్రారంభం నుంచీ లీలగా గాలిలో తేలిపోతూనేవుంది. సంధ్యా సమయంలో ఆకాశం అనే కంచుగంట ఖంగున మ్రోగుతున్నట్టు వుంటుందది. అది ఓంకారం లా వినిపించి, స్పష్టమైన సాహితీరూపం ధరించింది. పాటకు అనుగుణమైన లయలో ఇటూ అటూ పచార్లు చేస్తున్నది - వెర్రమ్మగారు. మాటి మాటికీ దారివంక చూస్తున్నది- మాలక్ష్మి కోసం)

లోపలి నుంచి

ఓ- ఒహో- ఓహో హా హో !
తరలె నహో !

తమ తమ యిండ్లకు గోవులు
తరలె నహో !

కడుపుల నిండా పచ్చిక మేసీ
కన్నుల నిండా కాంతులు గ్రోలీ !

పశుపతియే గోపాలుడు కాగా,
పరమానందమె చేపులు రాగా !

దివ్యలోకముల పుణ్యరాశులే
ధేనువులై ఇటు దిగివచ్చిన వన !
తమ తమ యిండ్లకు పశువులు
తరలె నహో !

(అప్పటికి వెంకన్న సెట్టి రంగం లోకి ప్రవేశించాడు – పశువుల్ని కట్టివేసుకుంటూ. ఆయన చేతిలో ఆవు మెడ పలుపు వుంది.)

వెర్రమ్మగారు

ఆ చచ్చినాడు ఇంకా రాలేదు, చూడు ! ఏమన్నా అంటే, ఆణ్నైన కేసుకొస్తావు! ఎలా చచ్చేది నేను ?

వెంకన్న సెట్టి

వస్తాడు లేవే !. పాపం, అమాయకుడు. ఏదో నేర్చుకోవాలి కాస్త.

వెర్రమ్మగారు

ఎంతకాలం ? ఆ డెక్కడో కూర్చుని, జోగుతూ వుంటే, దూడల్ని నువ్వు కట్టేస్తూ వుంటావా ? ఆడా, నువ్వా యజమాని ?

వెంకన్న సెట్టి

వాడూ కాదు, నేనూ కాదు. భగవంతుడు.

వెర్రమ్మగారు

ఆ ఆవుముండైనా కాస్త ముందఘోరిస్తే బాగుండును. అది ఆడి తోటే వుంటది తోకలా. ఎలా చచ్చేది నేను ?

వెంకన్న సెట్టి

అదిగో, వెయ్యేళ్ళాయుస్సు ! మాటలోనే వచ్చారు.

(సుబ్బారావూ, ఆవూ రంగంలో వెనుక భాగంలో ప్రవేశించి, రెండవ ప్రక్కకు నిష్క్రమిస్తారు. రంగం ఎదరభాగంలోకి తిరిగి ప్రవేశిస్తాడు సుబ్బారావు పలుపు కోసం. ఇదంతా చూస్తూనేవున్న వెర్రమ్మగారు, సుబ్బారావు తిరిగి ప్రవేశించగానే, కోపంతో చీపురుకట్ట ఎత్తి –)

వెర్రమ్మగారు

ఏరా చచ్చినోడ ! దూడ లెప్పుడొచ్చాయి ? నువ్వెప్పుడొచ్చావు ?

(ఒకటి వేస్తుంది. సుబ్బారావు కళ్ళెత్తి జాలిగా చూస్తాడు. వెంకన్న సెట్టి అడ్డం వస్తాడు. ఆమె చీపురు ఎత్తి ఇద్దరివంకా కసిగా చూచి, చీపురు పారేసి, సుబ్బా రావుతో–)

వెర్రమ్మగారు

ఇదిగో, నీకే చెప్పేది ! పని చెయ్యాలనుకుంటే తిన్నగా చెయ్ ! లేకపోతే అసలు పనే మానెయ్ ! జీతం తీసుకునేది నువ్వా, పనిచేసేది నీ ఖామందూనా? ఈ పద్ధతి నా దగ్గర పనికి రాదు, తెలిసిందా ? ఎప్పటికైనా మారతావేమో అని ఓర్చుకొస్తున్నా. మీ అయ్య ముఖంచూచి ఊరుకొంటున్నా. ఇదే చివరిమాట. ఈసారిగనక –

వెంకన్న సెట్టి

నీవు చెపుతున్నదంతా ఈ పసివాడి కర్థమవుతున్న దంటావా ?

వెర్రమ్మగారు

ముందు నీ కర్థమవుతున్నదా అని ? ఎలా చచ్చేది నేను ?

(ఆ పరిస్థితిలో గంగయ్య రంగంలో ప్రవేశిస్తాడు. తిరునామం కరిగిపోయి వుంది. పగలంతా పనిచేసి కందిపోయిన సంధ్యా సూర్యబింబంలా ఉన్న దతడి ముఖం,

ఆ సందచీకట్లో! అతడు చిన్నప్పటినుంచీ వారి కమతం చేస్తున్న నమ్మినబంటు. అతణ్ణి చూడగానే, అంత కోపంలోనూ కూడా వెఱ్రమ్మగారు చిరునవ్వు నవ్వింది. రిలీఫుతో వాతావరణం నిట్టూర్చిందా అన్నట్టు ఒక చల్లని గాలి తెర వీచిపోయింది.)

వెఱ్రమ్మగారు

ఇదిగో, గంగయ్యన్నా! ఇక నేను నీ కొడుకుతో చావలేను. ఒక్క సంగతి చెప్పు. నువ్వు నీ కొడుకును పాలేరుతనం పెట్టావా ? దత్తత ఇచ్చావా ?

గంగయ్య

(బాధగా) అంతమాటెందుకు, తల్లీ !

వెఱ్రమ్మగారు

ఇదిగో, ఇక నేను నీ కొడుకుతో చావలేను. పనంటే పనే. అంతకంటే నాకేం తెలీదు. అంతకంటే నాకేం వద్దు కూడా. నీ కొడుకును మా దగ్గర పాలేరుతనం పెట్టావు, అవునా ?

గంగయ్య

అవును, తల్లీ !

వెఱ్రమ్మగారు

ఆడిపని పశువుల్ని మేపుకురావడం, అవునా ?

గంగయ్య

అవును, తల్లీ !

వెఱ్రమ్మగారు

ఆడికి ఆ పని చేతకాదు. ఏ పనీ చేతకాదు. నేర్చుకోడు. నేర్చుకోడానికి

ప్రయత్నించడు. ఎప్పుడూ, ఎక్కడో, జోగుతూ కూర్చుంటాడు. మా పశువులు తెలివైనవి కాబట్టి కాని, నీ కొడుకులాంటివే అయితే, అవన్నీ ఎక్కడికి పోయేవో, ఏమైపోయేవో ! అవునా ?

గంగయ్య

అవును, తల్లీ !

వెర్రమ్మగారు

నీ కొడుకు ఎప్పుడూ మనుషుల్లో వుండడు. మేం ఓర్థి మనుషులం. నా పేరు వెర్రమ్మ గాని, నేను వెర్రిదాన్ని కాను. నీ క్కూడా ఇదే నా చివరిమాట. ఆడు ఇంకొక్కసారి గనక –

(టక్కున నిష్క్రమిస్తుం దామె. గంగయ్య ఒక నిట్టూర్పు విడుస్తాడు. అంతవరకు తనకేమీ సంబంధం లేనట్టు వెంకన్న సెట్టి చాటున నిలబడ్డ సుబ్బారావు, ఆయన చేతిలోని పలుపు తీసికొని, వెళ్ళిపోతాడు.)

వెంకన్న సెట్టి

గంగయ్యా !

గంగయ్య

(తల పైకెత్తి) బాబూ !

వెంకన్న సెట్టి

ఆమె అంతేగా ? ఏమీ బాధపడకు.

గంగయ్య

ఆ తల్లి నాకు తెలీదా, బాబూ ? ఆ తల్లి పలికే ప్రతి ముక్కా లోక సత్యమే.

వెంకన్న సెట్టి

కాని - సత్యం అంటే లోకం ఒక్కటే కాదుగా ?

గంగయ్య

అవును, బాబూ !

వెంకన్న సెట్టి

లోకం కంటే అతీతమైన సత్యం కూడా ఒకటుందిగా ?

గంగయ్య

కాని - అది సంసారాని కక్కరలేదు, బాబూ ! కలిమిగల సంసారినే లోకం గౌరవిస్తుంది. కలిమికి పని ఒక్కటే మార్గం.

వెంకన్న సెట్టి

మరి - నీ కొడుకు -

గంగయ్య

ఎవరి కొడుకైనా ఒక్కటే, బాబూ ! వాడి తల్లి యెంకి కూడా వాడి లాంటిదే, బాబూ ! ఏమీ తెలిసేది కాదు దానికి. సత్యకాలపు మనిషి అనే వాళ్ళంతా. దాని గుణాలన్నీ వీడికి వచ్చినై, వీణ్ని కనడానికే అది పుట్టిందన్నా రెవరో ! అది పోయిన తర్వాత మేనత్త పెంచింది వీణ్ని. వీడితల్లి చెల్లెలినే మళ్ళీ చేసుకున్నాను నేను. ఈ చిట్టెంకి మంచిదే గాని, కాస్త గడుసుది. మొదటి దానిది లోచూపు. బైటిలోకం ఎలా పోయినా సరే - దాని నిష్ఠే దానిది. దాని వ్రతమే దానిది. రాగం, ద్వేషం ఏమీలేవు దానికి. పరమ దుష్టుల్ని, శిష్టుల్ని కూడా సమంగానే చూసేది. వాళ్ళకర్మకు మనం కర్తలు కామనేది. ఈ రెండో దానిది వెలిచూపు. చక్కగా పని చేస్తుంది. అందర్నీ అలా చెయ్యమంటుంది.

చెయ్యనివాళ్ళను ద్వేషిస్తుంది. అచ్చం వెర్రమ్మతల్లి లాంటిది. పనే ప్రపంచ మంటుంది. కాయకష్టమే కైవల్యం దానికి. ఇదంతా మీకు తెలిసిందే. దానిపోరు పడలేక వీడ్ని మీదగ్గర పెట్టాను. పని నేర్చుకుంటా డనుకున్నాను. బాగుపడుతా డనుకొన్నాను. వీ డెప్పుడూ ఏదో దేవుడిసంగతి ఆలోచిస్తూ వుంటాడని దానితో చెప్పారు - మా కుర్రోళ్ళు కొందరు. దేవుడు కావలిస్తే అడవుల్లోకి పొమ్మని కసిరింది వాణ్ని. (కళ్ళొత్తు కుంటాడు)

వెంకన్న సెట్టి

నిజమే, గంగయ్యా ! ఏ మహారాజ గృహం లోనో పుట్టవలసినవాడు - ఏ మహారణ్యాలలోనో బ్రతకవలసినవాడు - వాడు ! సరేలే, వాణ్ని ఏమీ అనకు !

(ఇద్దరూ చెరోవైపుకి నిష్క్రమిస్తారు - చెరో మనస్థితితోనూ. అదే ఆలాపన, దాని వరసలో ఒక పద్యం, రంగంలో తేలియాడుతున్నై.)

లోపలి నుంచి

ఆత్మవేదికి, బ్రహ్మజ్ఞుడైన సుధికి,
అడవులే తప్ప లేదె గత్యంతరమ్ము ?
రాజభోగి విధమ్మున, రాజయోగి
ఏల మనలేడొ అంతఃపురాలలోన ?

# బాలయోగి

## అంకం మూడు

(తెర లేవడానికి ముందు నుంచే కథకుని కథనం సాగుతుంది.)

కథకుడు

పశులగాపర్లందరిలోకి పంటతల్లి ఘటికురాలు. ఆమె ఎవరికీ పాలేరు కాదు. తన స్వంత పశువుల్నే మేపుకుంటూ వుంటుంది. ఒక మగ బనియను, లంగా ధరించి, మగపిల్లలతో కలిసి వున్నా - ఆమె ఆటా పాటా దివ్యంగా వుంటై. సుబ్బారావుకు చాలా సన్నిహితురాలు. రోజూ ఏవో కొత్త పాటలు పాడుతూనే వుంటుందామె. ఆ పాటల్లోని వూహలు సుబ్బారావు వనీ, మాటలు తనవనీ, వరసలు సినిమాలవాళ్ళవనీ తానే చెప్పుకొంటూ వుంటుంది. శివుని సంధ్యానృత్యానికి నిత్యం తన గాత్రాన్ని మేళవించే లక్ష్మి - ఏ అపస్వరం కారణంగానో భూలోకానికి అవతరించి, ఈ పచ్చిక పొలాల సాయం సంధ్యలలో - ఈ పల్లెటూరి పశులగాపరులె బృందారకులుగా - మానవ లోకానికి ఆనంద కళావిభూతిని పంచి పెడుతున్నదేమో అనిపిస్తుంది - పంట తల్లిని ఆ సమయంలో చూచినప్పుడు. కేవల శివలింగమే అనవచ్చు - జడుడై కూర్చున్న పండూను.

(అప్పుడు తెర లేస్తుంది. దృశ్యం చాలవరకు మొదటి రంగం లాంటిదే. మైలు రాయిపై నిమీలిత నేత్రుడై కూర్చుని ఉన్నాడు- సుబ్బారావు. అతని చుట్టూ నాట్యం చేస్తూ పంట తల్లి పాడుతోంది.)

పంటతల్లి

కళ్ళు మూసుకొని కూర్చున్నావో ?
వళ్ళు మరచి నిదరోతున్నావో ?
వెలుగును మేసే చీకటి దున్నలు
విరుచుక పడుటే కన కున్నావో ?

ఏమిటిరా ఈ నటన ?
ఎందుకురా ఈ ఘటన ?
శివ చరణాదులు చిహ్నములో యన
చెంగల్వలు పూచిన శుభవేళ,
చీకటి పేరున నల్లగల్వ లిటు
సేకరింతువో పూజకు నీవే !
ఏమిటిరా ఈ నటన ?
ఎందుకురా ఈ ఘటన !

(ఈలోగా దండాలు, జెండాలు, వీరంబాబు మొదలైన పశులగాపర్లు, రైతు కుర్రవాళ్ళు, కూలీలు అనేకమంది అక్కడికి చేరారు. అట్టి సమయంలో స్వాములవారు రంగంలో ప్రవేశించాడు. మోకాళ్ళ వరకు ఒక కావి అంగవస్త్రం, భుజం మీద ఒక తుండు గుడ్డ, చేతిలో ఒక దండం - అంతే ఆయన ఒంటి మీద ఇతర వస్తువులు. అనాచ్ఛాదితమై వున్న తక్కిన శరీరమంతా ఆత్మీయమైన బ్రహ్మతేజంతో వికసించి ఉంది. చూడగానే భక్తిగౌరవాలు భాసించే మూర్తి ఆయనది. ఆయన అక్కడ ఆగి, వాళ్ళతో కలిసి ఆ దృశ్యాన్ని కొంతసేపు చూచి)

స్వాములవారు

ఏదైనా నాటకానికి రిహార్సలా ?

వీరంబాబు

వీరోహం ! మీకు నాటకం రిహార్సలే కావలిస్తే, అలా గ్రామం లోకి వెళ్ళండి.

జెండాలు

లంక తల్లమ్మ జాతర కోసం అక్కడ కావలసినన్ని రిహార్సల్సు జరుగుతున్నై.

దండాలు

ఓరీ, నీ ! మా పేటలో పాలేరు నాటకం రిహార్సలుంది. అక్కడి కెళ్ళండి.

స్వాములవారు

మరి - ఇదేమిటి ?

వీరంబాబు

కేవలం మ్మా జీవితం.

పంటతల్లి

ఇలాంటి నాటకాలు కూడా వుంటాయా ?

స్వాములవారు

ఎందు కుండవు ?

(ఈ మాట లనే సమయానికి సుబ్బారావు కళ్ళు తెరచి స్వాములవారిని చూశాడు. లేచి నిలబడ్డాడు. కొంచెం ఎదరకు వచ్చాడు. స్వాములవారు అతణ్ణి పరిశీలనగా చూశాడు. ఏదో ఆలోచించి, తల పంకించి, చిరునవ్వు నవ్వాడు.)

స్వాములవారు

(పంటతల్లితో) ఈలాంటి నాటకాలు ఎందు కుండవు. తల్లీ ? ఇది ఈనాడు మీ జీవితమే కావచ్చు. రేపు మా కందరకు శిరోధార్యమైన నాటకం ఎందుకు కాకూడదు ? ఋష్యశృంగుడు, మార్కండేయుడు, ధృవుడు, బాలకృష్ణుడు మొదలైన ఎందరో బాలకుల చరిత్రలే నేటికీ నాటకాలై లోకాన్ని లక్ష్యవంతం చెయ్యడంలేదా ?

సుబ్బారావు

మా పశులగాపర్ల జీవితాలకు అంతటి అదృష్టమా, స్వామీ ?

జెండాలు

ర్రే ! పండూకు మాటలు వచ్చే ! ఏం చిత్రం !

దండాలు

ఓరి, నీ ! నే నెప్పుడూ వినే లేదు !

పోతరాజు

(వికటంగా) ముంగి !

దండాలు

పాముల్రోయ్ ! పాపాములు !

వీరంబాబు

వీరోహం !

పంటతల్లి

మీకు లాగ వాగాలా, ఏం ?

స్వాములవారు

(ఆశ్చర్యంతో) మౌనమే మహావాక్కు నాయనా ! ప్రతిరోజూ గంటల తరబడి ప్రసంగాలు చేసే మనలాంటి వాళ్ళ కంటే, జీవితంలో అవసరమైనప్పుడు మాత్రమే, ఏ ఒక్క మాటో మాట్లాడే మహామౌనులే నాయకులు ప్రపంచానికి. (సుబ్బారావుని నిమురుతూ) నీ కా సందేహం అక్కరలేదు తండ్రి ! లీలామానుష విగ్రహుడై, లోకానికి గీతాభిక్ష పెట్టిన ఆ కృష్ణభగవానుడే పశుల గాపరి ! పరమేశ్వరుడు మొదలు పాలేరు నాటకకర్త వరకు ఆత్మకళాభిజ్ఞులందరూ ఆలగాపరులే! పశుపతులే !

(ఇంతలో మాలక్ష్మి వచ్చి, సుబ్బారావును నాకి అక్కడే నిల్చి, స్వాముల వారికేసి చూస్తుంది.)

స్వాములవారు

(ఆవు మూపుపై చేయి వేసి దువ్వుతూ) కామధేనువు !

దండాలు

ఓరి, నీ ! అప్పుడే ప్రొద్దుగూకిపోయింది ! పశువు లన్నీ ఇంటిదారి పట్టినై!

జెండాలు

మీ కామందురాలి మాట మరచిపోకురోయ్, పండూ !

వీరంబాబు

వీరోహం ! నే చెప్పుతాలేరా ! ఏం భయం లేదు.

పంటతల్లి

దేవుడు దిగివచ్చినా వినదు, ఆ అమ్మగారు.

స్వాములవారు

వెళ్ళిరా, నాయనా ! మళ్లీ కలుసుకుందాం.

(సుబ్బారావు తలను మళ్లీ వాత్సల్యంతో నిమిరి, వదిలేస్తాడు. సుబ్బారావు ఆయన పాదధూళి స్వీకరించి, నొసట ధరించి, మాలక్ష్మితో నిష్క్రమిస్తాడు. అందరూ తలొకవైపుకు పోతారు. స్వాములవారి ఆనంద వికసిత నయనాలు క్షణ మాత్రంలో ఆశ్చర్యవిలసితాలవుతై. రెండవవైపు నుండి మాలక్ష్మి, సుబ్బారావు మళ్లీ రంగంలోకి ప్రవేశిస్తారు.)

సుబ్బారావు

(వినయంగా) ఎందుకో, మిమ్ము విడిచివెళ్ళడం బాధగా వుంది, స్వామీ ! మాలక్ష్మికి కూడా అలానే వున్నట్టుంది - తిరిగి ఇటే దారి తీసింది.

స్వాములవారు

(సుబ్బారావును, గోవునూ చెరో చేత్తో నిమురుతూ) ధన్యుడవు, నాయనా ! ధన్యుడవు! నీవు, నీవు కాసే పశువులు, నీ చెలులు, నీ తలిదండ్రులు - అంతేకాక, నీవు పుట్టిన ఈ యుగంలోని సమస్త ప్రజలూ, ప్రాణులూ కూడా - ధన్యులే !

(అప్పటికే తిరిగి రంగంలోకి వచ్చి వుంది పంటతల్లి. సుబ్బారావు అర్థంగాక స్వాములవారికేసి చూచి, పంటతల్లి కేసి చూస్తాడు.)

పంటతల్లి

అంటే ఏమిటి, స్వామీ ?

స్వాములవారు

(నవ్వుతూ) నా భాష అర్థం కావడం లేదా ?

పంటతల్లి

మాటలు కాదు - వాటి లోతులు.

స్వాములవారు

(మెప్పుగా - తనలో తాను) ఔను, మీరు కారణజన్ములు ! (వాళ్ళతో) అనుభూతులకు అర్థా లుండవు. మాటలు ప్రజలకు, అర్థాలు పండితులకు, అనుభూతులు యోగులకు.

(ఆ క్షణంలో ఆకస్మికంగా, బంగారంగారు రంగంలోకి ప్రవేశిస్తాడు. అతడు పర్సనాలిటిలో స్వాములవారిని పోలి వుంటాడు. కాని - ఖరీదైన శాలువలు, రుద్రాక్షలు వగైరా బాహ్యాడంబరాల బరువు ఎక్కువగా వుంటుంది. మూఢాచార కాండ కరడుగట్టిన శిలావిగ్రహంలా వుంటా డతడు, రంగం లోని వాళ్ళను చూచి, టక్కున ఆగి, వెనక్కి ఒక అడుగు వేసి -)

బంగారంగారు

ఎక్కడో చూశాను తమర్ని !

స్వాములవారు

ఎక్కడైనా చూచివుండవచ్చు.

బంగారంగారు

ఎక్కడో విన్నాను మీ కంఠం !

స్వాములవారు

ఎక్కడైనా విని వుండవచ్చు.

బంగారంగారు

(స్వాములవారి సమాధానాలు తనకు అనుగుణంగా లేకపోవడం వల్ల హతాశుడై, కొంచెం కఠినంగా) ఆహా ! సరే గాని - వాడొక చండాలుడు. అతగాణ్ని తమరు -

స్వాములవారు

(అతిశయంతో కూడిన చిరునవ్వుతో) ముట్టుకున్నా ననేగా ? పోనిద్దురూ! క్షణభంగురాలైన శరీరాలేగా ! బ్రహ్మవాదులం మనం. మనకు శరీరాలతో ఏం పని ? వాటి కర్మాకర్మల ప్రసక్తి దేనికి ? నేటి రూపాలు రేపటి భస్మాలు ! ప్రతి భస్మాణువూ పరమేశ్వర పూజా ద్రవ్యమే కదా ?

బంగారంగారు

వేదాంతం వేరు ! దైనందిన జీవిత వ్యవహారం వేరు.

స్వాములవారు

జీవితాన్ని క్రమబద్ధం చేయడానికే గదా వేదాంతం ?

బంగారంగారు

(విసుగ్గా) మరి - మాలమాదిగలు -

స్వాములవారు

(ఖచ్చితంగా) మన హిందువులకు వేదాన్ని, వేదాంతాన్నీ సమకూర్చి పెట్టిన వ్యాసమహర్షి మాలమాదిగ వాడేగా ?

బంగారంగారు

అదంతా ఏనాటిదో ! నిజమో ! అబద్ధమో ! ఇప్పటి పరిస్థితి ఏమిటి ?

స్వాములవారు

ఇప్పటి పరిస్థితి – ఈ నిమిషంలో పరిస్థితి – సమస్త వేదవేదాంగ పారంగతుడ నైన నేను, ఈ మాలపిల్లవాణ్ని ఒడిలో పెట్టుకుని ముద్దాడుతున్నాను. కనిపించడం లేదా ?

బంగారంగారు

(కోపంగా) నాకు కళ్ళున్నై.

స్వాములవారు

(నవ్వుతూ) అదే భ్రాంతి ! మీకు కళ్ళున్నాయనుకొంటున్నారు మీరు. నిజానికి అవి కళ్ళుకాదు. శతాబ్దాల పూర్వం, ఎవడో మానవ విరోధి మీ కిచ్చిన గచ్చుకాయ లవి! వాటి వెనుక నిరంతర పురోగామినియైన చైతన్యజ్యోతి లేదు. గతంలోని ఒక శిథిలావశేషం మీరు. పరమజీవన ప్రవాహమూర్తులు కారు.

బంగారంగారు

(పేద కోపంతో) అర్థంగాని వ్యర్థాలాపన.

స్వాములవారు

(శాంతంగా) మీ కర్థమయేటట్టే చెబుతాను, మహాశయా ! నిజానికి నే నెవర్నీ ముట్టుకోను, పశుపక్ష్యాదుల స్పర్శే కాదు – మానవ స్పర్శ కూడా నాకు గిట్టదు. రాగద్వేషాల ప్రమేయం లే దిక్కడ. మరొక శరీరం స్పర్శను నా శరీరం సహించదు. అంతే. కారణం చెప్పలేను. ఫలితం – నే నెవర్నీ ముట్టుకోను. నన్ను ఎవరైనా ముట్టుకోడానికి వస్తే – అందకుండా పారిపోతాను ! ఈ కుర్రవాడెవడో నాకు తెలీదు. మానవతా పునరుజ్జీవం కోసం, మహాయోగుల్ని వెతుక్కుంటూ విశ్వ పర్యటన చేస్తున్న

నాకు, ఇక్కడ ఈ కుర్రవాడు కనిపించాడు. వీణ్ని చూడగానే ముట్టుకోవా లనిపించింది. నాకు ఎవణ్ని ముట్టుకోవా లనిపిస్తుందో, వాడొక్కడే స్పృశ్యుడు. తక్కిన వాళ్ళంతా అస్పృశ్యులు.

బంగారంగారు

(ఓడిన మనస్సుతో) నన్ను ముట్టుకోవా లనిపించడం లేదా ?

స్వాములవారు

(మూతి విరిచి) లేదే ? పైగా, నీ నుంచి పారిపోవాలనిపిస్తున్నది !

(వెనక్కు తిరిగి స్వాములవారు పారిపోతాడు. ఆయన వెంట ఆవు తోక మెలికలుగా త్రిప్పి, గంతులేస్తూ నిష్క్రమిస్తుంది. దానివెంట సుబ్బారావు. పంటతల్లి నిష్క్రమిస్తారు. బంగారంగారు ఉగ్రుడౌతాడు)

బంగారంగారు

హోరి, నీ ! మాలాడు స్పృశ్యుడూ, నేను అస్పృశ్యుడినీనా ? చూస్తా వీళ్ళ సంగతి! కుదురుస్తా వీళ్ళరోగం ! గాంధీ గెలిచినప్పటి నుంచి వీళ్ళు మరీ తెగించిపోతున్నారు ! గోచిపాతరాయుడు గెల్చాడట ! నా పేరు బంగారంగారు ! హుం ! (దురుసుగా నిష్క్రమిస్తాడు. అతణ్ని వెక్కిరిస్తున్న సరళిలో ఆలాపన పద్యాకృతి ధరిస్తుంది.)

లోపలి నుంచి

శ్రుతుల దాచినయట్టి అసురుల నుండి,
కూర్మి సుతులను రానీని గుడుల నుండి,
సరి నరుల దోచుకొను సమాజమ్ము నుండి
పారిపోవక నిలుచునా పరమశివుడు ?

# బాలయోగి

## అంకం నాలుగు

(దృశ్యం - ఒక మాదిరి మూడో అంకం వలెనే. కొబ్బరి తోటల మధ్య ఒక రోడ్డు. రోడ్డు మీద ఒక సినిమా ప్రకటన బండి. బండి చుట్టూ ప్రకటనల అట్టలు. బండిలో గ్రామఫోను నుంచి ఏవేవో పాటలు. బండిలో ఒక కుర్రవాడు కూర్చుని కరపత్రాలు పంచుతున్నాడు. ఒక టూరింగు సినిమా వచ్చిందా వూరు. రెండు మూడు రోజుల నుంచి, డేరా నిర్మించుకొంటోంది. ఆ రాత్రినుంచే ఆట ప్రారంభం. భక్తమార్కండేయ పిక్చరు. పాటలగోలతో బండి మెల్లగా సాగుతోంది. కరపత్రాలకోసం పిల్లలూ, పెద్దలూకూడ ఎగబడుతున్నారు. వాళ్ళలో పంటతల్లి కూడా ఉంది. ఆమె ముఖాన్న గుప్పెడు కరపత్రాలు విసిరేసి, బండి వెళ్ళిపోయింది, వాటికోసం, ఆమెచుట్టూ మూగారు పిల్లలు. వాళ్ళ ముఖాన కొన్ని విసిరేసి, ఆమె పారిపోయింది. వాటిని ఏరుకుంటూ పిల్లలు ఆమె వెంట నిష్క్రమించారు. రంగం ఖాళీకాగానే, రెండోప్రక్కనుంచి సుబ్బారావు ప్రవేశించాడు. అక్కడ పడివున్న ఒక కరపత్రాన్ని ఎత్తాడు. దానివంక తదేకంగా చూడసాగాడు. ఆ కర పత్రంమీద బొమ్మ ముద్రించబడివుంది. యముడి బారి నుండి తప్పించు కోవడం కోసం మార్కండేయుడు ఒక పెద్ద శివలింగాన్ని గట్టిగా కౌగిలించుకొన్న బొమ్మ అది. ఒక ప్రక్క శివుడు, ఒక ప్రక్క యముడు. ఆ పైని నారదుడు కూడా కనిపిస్తున్నాడు దానిలో. అలా అతడు చూస్తూ వుండగా, అక్కడికి వెనకనుంచి పంటతల్లి వచ్చింది. ఆమె మెల్లిగా వచ్చి, అతడి చేతిలో కరపత్రాన్ని చూచి, నిరుత్సాహ పడింది. ఆమె చేతిలో రెండు కరపత్రాలున్నై. వాటిని అతడి కోసం తెచ్చింది మరి!)

సుబ్బారావు

(ఆమెవంక చూడకుండానే) చూశావా, మార్కండేయుడు !

పంటతల్లి

అచ్చం నీకు లాగానే వున్నాడు ! శివుణ్ని చూడగానే యముడు పరుగుచ్చుకున్నాడు... చూడు ఆ ... దున్నపోతు మన బంగారం గారి పోట్లదున్నపోతులా లేదూ ? (పకపక నవ్వుతుంది)

సుబ్బారావు

నారదులవారు మన స్వాములవారిలా వున్నారు.

పంటతల్లి

ఎంత బాగున్నాడో ! బలేగా ఎన్నో కథలు చెప్పా డన్నావు కదూ ? అవన్నీ నాకు చెప్పవా ? సినిమా చూద్దామా రాత్రికి ?

సుబ్బారావు

మార్కండేయుణ్ని చూడాలనే వుంది - కాని -

పంటతల్లి

ఏం భయం లేదులే. వెడదాం.

(అంతలో అక్కడికి బంగారంగారు వస్తాడు. దూరంగా నిలబడి, వాళ్ళిద్దరినీ చూస్తాడు. చీదరించుకుంటాడు)

బంగారంగారు

ఎక్కడికే, వెళ్ళడం ?

(ఉలిక్కిపడి వెనక్కు చూస్తుంది - పంటతల్లి. సుబ్బారావు అలానే బొమ్మను చూస్తూ వుండిపోతాడు. బంగారంగారు కాసేపు వాళ్ళ కేసి రాకాసి చూపులు చూచి, వాళ్ళ చేతుల్లోని కాగితాలను గమనించి, తల పంకిస్తాడు.)

బంగారంగారు

(వికటంగా) ఏం భయం లేదా ?

**పంటతల్లి**

(మూతి బిగబట్టి) లేదు.

**బంగారంగారు**

(ఉలిక్కిపడి) లేదా ?

**పంటతల్లి**

(కసిగా) లేదు. లేదని మా తాతయ్య చెప్పాడు.

**బంగారంగారు**

ఎవడు ? ఏం చెప్పాడు ?

**పంటతల్లి**

మా తాతయ్య చెప్పాడు. భగవంతుణ్ని నమ్మిన మనిషికి మరో మనిషినుంచి భయంలేదట !

**బంగారంగారు**

(పిచ్చిగా) వెధవ ! వాడిపని చెపుతా ! (నిష్క్రమిస్తాడు)

**పంటతల్లి**

(సుబ్బారావుతో) ఈయనగారే నిన్న మీ అయ్యకూ, మీ ఖామందుగారికీ, ఏమి టేమిటో నూరిపోస్తున్నాడు. నే చూశా !

(సుబ్బారావు కళ్ళెత్తి చూశాడు. మాట్లాడలేదు.)

**పంటతల్లి**

నువ్వు తిట్టినా బదులు చెప్పవట ! కొట్టినా ఏడవ్వట. అందుకేనట మీ వాళ్ళకి నీమీద కోపం ! మీ అయ్య అంటుంటే విన్నా !

(సుబ్బారావుకి అర్థం కాలేదు. అయోమయంగా చూశాడు)

పంటతల్లి

ఏడ్చేదాకా తన్నాలని, ఏడ్చి చచ్చేదాకా అన్నం పెట్టగూడదని, సలహా ఇస్తున్నాడు బంగారంగారు !

(సుబ్బారావు పరధ్యానపు కళ్ళలో – మేఘాచ్ఛాదిత నభంలో మెరుపులా - ఒక జ్యోతి ప్రకాశించింది ! దానితో రంగం తళుక్కు మన్నది. తనలో తాను గొణుక్కున్నట్లుగా అన్నాడు –)

సుబ్బారావు

అన్ని అనర్థాలకూ కారణం అన్నమేగదా !

పంటతల్లి

అదేమిటి అలా అంటావు ? అన్నం కోసం కాకపోతే ఈ అవస్థలన్నీ ఎందుకు ?

(మనోహరమైన చిరునవ్వుతో తేరిపార జూచాడు - సుబ్బారావు - ఆమె ముఖంలోకి. ఇద్దరూ అలా ఒకరి ముఖంలోకి ఒకరు అర్థంకాని చూపులు ప్రసరించుకోసాగారు. సుబ్బారావు చిరునవ్వును కథకుడు వివరించసాగా డా క్షణంలో)

కథకుడు

సుబ్బారావు ఆకస్మికంగా నవ్విన ఆ వింత నవ్వులో ఎన్నో భావాలు ! మానవ మనస్తత్వంపట్ల ఎంతో అపహాస్యం ! తానొకమాట అన్నాడు. ఆ మాట కాదంటూ ఆమె మరో మాట అన్నది. ఆ రెండు మాటలూ విభిన్నార్థకాలేనా ! కాకపోతే, వివాదం ఎక్కడ? ఈ కొట్లాటలు, పోరాటాలు అన్నీ ఒకరిమాట ఒకరికి అర్థంకాకనే యేమో ! మాట పట్టింపే మహాయుద్ధమేమో ! ఒక్క మానవుల విషయంలోనే కాదు, సమస్త జీవుల విషయంలోనూ కూడా, అన్ని కష్టాలకూ, దుఃఖాలకు బీజం అన్నమైతే – దాని వ్యాప్తికి హేతువు మాట. ఇంతభావం వుంది అతడి చిరునవ్వులో ! ఈ రెండింటినీ జయించడమే జీవికి అంతిమ విజయం అన్న భావం పొడచూపగానే అతడి ముఖం గంభీరమై పోయింది !

పంటతల్లి

ఏమో, బాబు ! నాకేం తెలీదు. కాని – నీకు మాత్రం ఏం భయంలేదు. అసలు – వాళ్ళందరూ నీకే భయపడుతున్నారు !

(అంతలో దండాలు, జెండాలు మొదలైన చాలామంది బిలబిలమంటూ రంగంలో ప్రవేశించారు.)

జెండాలు

ర్రే ! ఇంకా ఇక్కడే వున్నార్రా ? ఆట మొదలై పోతుంది(ర్రా ! త్వరగా పదండి! అదిగో దేరా దగ్గర పాట !

(నిష్క్రమిస్తారు – హడావుడిగా ! దూరంలో పాటొకటి వినవస్తూ వుంది. పంటతల్లి, సుబ్బారావు ఆలకిస్తూ నిలబడ్డారు.)

లోపలి నుంచి

**ఈశ్వరు డొకడేరా ! ప్రా**
**ణేశ్వరు డొకడేరా !**
**సర్వజనులకు**
**సర్వజీవులకు**
**సము డొక శివుడేరా !**
**మృత్యుంజయు డొక శివుడేరా !**
**నిత్య శివార్చనె జీవమురా !**
**శివపంచాక్షరి**
**చేసే మనుజుడు**
**చిరంజీవి కదరా !**

# బాలయోగి

## అంకం అయిదు

(దృశ్యం - టూరింగు సినిమా దేరా ముందు భాగం, జనం ఇటూ అటూ తిరుగుతూ వున్నారు. ఆట ప్రారంభమై నడుస్తున్నది. లోపలి నుంచి మాటలు పాటలు బైటికి వినిపిస్తున్నై. దేరా సందుల్లోంచి పిక్చరు కొంత వరకు కనిపిస్తున్నది కూడ. జనం దేరా చుట్టూ చేరి, సందుల్లోంచి తొంగిచూస్తున్నారు. సినిమా సిబ్బంది కర్తవ్యం తోచక ఊరుకున్నారు. అంతలో జెండాలు, దండాలు మరికొందరు ఆలగాపర్లు పరుగున అక్కడికి వస్తారు. చాల అలసిపోయి, ఆయాస పడుతూ వుంటారు. ఆట మొదలై పోయినందుకు నిరుత్సాహం ప్రకటిస్తారు.)

దండాలు

ఓరి, నీ ! ఆట మొదలై పోయిందిరా ! స సగం పైనే అయిపోయి నట్టుంది !

జెండాలు

ఎంత త్వరగా చేసినా, ఖామందుగారింటి దగ్గర పని తెమలలేదురా ! (ఆయాసపడతాడు) అక్కడినుంచి ఏక పరుగున వచ్చేశాను. అయినా -

దండాలు

మా ఖామందుగారి గేదెకు ఏదో దెయ్యం పట్టుకుందిరా ? తి తిన్నగా పాలిచ్చి చావలే !

జెండాలు

పోనీ - పదిగంటల ఆటకి వెళదాం.

దండాలు

(ఈ లోపల దేరాసందు లోకి తొంగిచూస్తూ) అదుగోరా, మార్కండేయుడు !

జెండాలు

(తాను కూడా తొంగి చూచి) ౸రే ! మన కంటే చిన్న కుర్రాడురోయ్ !

దండాలు

అచ్చం పండులా లేడట్రా ?

జెండాలు

నారదులవారు ! నారదులవారు ! ఏదో బోధ చేస్తున్నాడ్రా – మార్కండేయుడికి! పాపం మార్కండేయుడు ఎలా కూర్చున్నాడో మెదలకుండా !

దండాలు

అలా కూర్చుంటాడనేగా, మన పండూని జోగులాడంటా రందరూ ?

జెండాలు

ఒరే ! చచ్చిపోవడం అంటే ఏమి టంటావు ?

దండాలు

ఓరి, నీ ! అదే తెలీదట్రా ? మరణించడం !

జెండాలు

ఓహో, ఔను !

దండాలు

మొన్న వజ్రంగారు మరణించలే ? అలాంటిది !

జెండాలు

ఈ బంగారంగారు ఎప్పుడు మరణిస్తాడో మరి !

దండాలు

వజ్రంకంటె బంగారం గొ గొప్పకాదులేరా !

(లోపల హఠాత్తుగా పెద్ద గలభా ! అరుపులు, కేకలు. కోపంతో చిందులు తొక్కుతూ, బంగారంగారు రంగంలోకి వస్తాడు)

బంగారంగారు

ఉండను, ఉండనంటే ఉండను. చూడను, చూడనంటే చూడను. ఉండను, చూడను, ఘోరకలి ! ఘోరకలి ! (చిందులు త్రొక్కుతాడు.)

(అతణ్ని అనుసరించి – వెంకన్న సెట్టి, మరికొందరు అడావుడిగా ప్రవేశిస్తారు.)

వెంకన్న సెట్టి

ఏమయిందండీ ? ఏమయింది ?

బంగారంగారు

ఏ మవాలి ! ఇంతకంటే ఏమవాలి ? గాంధీ చెపితే మాత్రం ? ఇంత ఘోరకలా? ఒక మాలాడు అందరితో కలిసి కూర్చోడమా ? మీలాంటి పెద్దలు ఊరుకోడమా ? హూ !

లోపలినుంచి

కొట్టండి ! తన్నండి ! పట్టుకోండి ! యెధవని !

(ఆ క్షణంలో తెరలో నుంచి సుబ్బారావు, అతడివెనుక ఒకచెప్పూ, ఒకేసారి విసురుగా రంగం లోకి రాగా – సుబ్బారావు వెంకన్న సెట్టి చాటుకు వెళతాడు. చెప్పువెళ్ళి బంగారంగారి నెత్తికి తాకింది. బంగారంగారు కోపంతోను, బాధతోనూ అరుస్తాడు. తరువాత అవమానంతో ఉగ్రుడై చిందులు త్రొక్కుతాడు. రెండోప్రక్క నుంచి, వీరంబాబు దూసుకు వస్తాడు)

వీరంబాబు

వీరోహం ! చంపేస్తా ! ఎవడైనా సరే ! మీద చెయ్యి వేశాడంటే – చచ్చాడన్నమాటే! వీరోహం ! (పిడికిళ్ళుబిగించి ఇటూ అటూ చూస్తాడు)

బంగారంగారు

చెయ్యి వెయ్యడమే కాదురా ! చెప్పుతో కూడా కొట్టాడు. చంపడమే కాదు, చిత్రవధ చెయ్యాలి, గాడిదకొడుకుని ! చెప్పుతో కొడతాట్రా నన్ను ? (మరీ ఉక్రోషంతో చిందులు త్రొక్కుతాడు. వీరంబాబు అయోమయంగా చూస్తాడు. అప్పుడు చెప్పు వచ్చిన ప్రక్క నుంచి పరుగెత్తుకొంటూవస్తాడు – పోతరాజు. అతడి చేతిలో ఒక చెప్పు వుంటుంది.)

పోతురాజు

(వగరుస్తూ) కొట్టండి ! తన్నండి ! పట్టుకోండి, యెధవని ! (నిలబడి వెర్రిగా చూస్తాడు.)

బంగారంగారు

(ఉగ్రుడై) ఆ చెప్పు, నీదట్రా, దున్నపోతా ? (కోపం పట్టలేక పోతురాజు మీదకు వెళతాడు కొట్టడానికి)

పోతురాజు

(చేతిలో చెప్పు జారవిడిచి, వణికిపోతూ, చేతులు జోడించి)

బాబ్బాబ్బాబు గారు ! పప్పండూగాడి మీద కిసిరానండి ! మీ మీ్మకు తగిలిందాండి?

వీరంబాబు

(ఎగిరి గంతేసి, పగలబడి నవ్వుతూ) వీరోహం ! తగలవలసిన చోటే తగిలిందిలేరా, పోతు ! చింత పడకు !

దండాలు

ఓరి, నీ !

(పోతురాజు, వీరంబాబును చూచి మరీ వణుకుతాడు. ఇటు ఖామందు బంగారంగార్నీ, అటు వీరంబాబును చూస్తూ ఒకటే వణకడం వణుకుతాడు. అటు బంగారంగారు పళ్ళు కొరుకుతాడు. ఇటు వీరంబాబు హుంకరిస్తాడు. పోతురాజు రెండు చెప్పులూ రెండుచేతుల్లోకి తీసికొని, ఇటూ అటూ చూచి, పారిపోతాడు)

వీరంబాబు

(పారిపోతున్నవాణ్ని గేలిచేస్తూ) వీరోహం !

బంగారంగారు

(కసిగా) ఏడిశావ్ !

(వీరంబాబు తీవ్రంగా చూస్తాడు. బంగారంగారు కంగారు పడతాడు. వెంకన్న సెట్టి ముందుకు వస్తాడు. ఈ లోగా అక్కడ చాలా మంది జనం మూగుతారు – గంగయ్య, పంటతల్లి వగైరా. గంగయ్య కళ్ళొత్తుకుంటాడు.)

గంగయ్య

(బంగారంగారితో) వాడొక పిచ్చాడండి బాబు ! వాడేమన్నా పొరపాటు చేస్తే రక్షించండి. (చేతులు జోడిస్తాడు)

బంగారంగారు

(కోపంగా) పిచ్చాడా ! వాడు కాదురా పిచ్చాడు – మనం ! పిచ్చాళ్ళం మనం! మహా మహావాళ్ళు చెయ్యలేనిపని వాడు చేశాడు. అమాంతం నా పక్క కొచ్చే కూర్చున్నాడు. మొఖం మీద తన్నినంత పని చేసి – పొరపాటట ! పొరపాటు; హూ !

పంటతల్లి

(బిక్కు బిక్కుమంటూ ముందుకువచ్చి – గంగయ్యతో) లేదు, మామయ్యా ! మేం

కూర్చోవాలని కూర్చోలేదు. మార్కండేయులవార్ని బాగా చూడాలని, దేరాగుంజలు అడ్డు లేనిచోటికి వెళ్ళి కూర్చున్నాం. అంతే !

బంగారంగారు

అంతే ! హూ ! (హుంకరిస్తాడు).

వీరంబాబు

వీళ్ళిద్దరూ, పశువుల్ని వదిలేసి, ముందుగానే హాల్లోకి పోయి కూర్చున్నారు. నేను చూశాను. పండూదగ్గరికి బంగారంగారు వెళ్ళి కూర్చున్నారుగాని, బంగారంగారి దగ్గరకు పండూ వెళ్ళి కూర్చోలేదు.

వెంకన్న సెట్టి

సాయంత్రం దూడలు మామూలుగానే వచ్చేసై, మాలక్ష్మి కూడా వచ్చేసింది. ఉదయం పిల్లలందరితోపాటు, వాడికి కూడా పండక్కి డబ్బు లిచ్చాను. వీడు సినిమాకే వెళ్ళి వుంటాడని ఇలా వచ్చాను. తీరా –

గంగయ్య

మా వాడి జతపట్టి తన మనుమరాలు చెడిపోతూ వున్నదని పంటతల్లి తాత దూడల్ని కట్టేసుకుంటూ తిట్టుకొంటుంటే – అతడితో పోట్లాడి, ఇలా పరుగెత్తు కొచ్చాను, బాబూ ! పంటతల్లివి సొంతపశువులు. అది ఎలా ఆడినా ఆడగలదు. వీడు ఒక అయ్య దగ్గర పాలేరు. వీడికి ఇక తగిన బుద్ధి చెప్పాలి. బాబూ !

బంగారంగారు

(ఉత్సాహంతో) ఇప్పటి కిప్పుడు, ఇక్కడి కిక్కడ, వాడి వొళ్ళు చిట్లగొట్టు? ఊ!

(అప్పటికి స్వాములవారు రంగంలో ప్రవేశించాడు. బంగారంగారి వంక తీవ్రంగా చూశాడు.)

స్వాములవారు

ఎవరి వొళ్ళయ్యా చితగ్గొట్టడం ? వేదమాత వొళ్ళేనా ? ఎందుకయ్యా ఇంకా ఈ అవైదిక వైఖరి ? భారతదేశంలో వైదికమతాన్ని బ్రతక నివ్వవా ఏమిటయ్యా ? "కుర్వంతో విశ్వమార్యం" అంటూ, ప్రపంచమంతా వేదమతాన్ని బోధించుమని వేదమాత గోలపెడుతుంటే ఉన్న వాళ్ళనే తరిమికొట్టేస్తున్న నీ వేదద్రోహ వైఖరి ఇంకా ఎంతకాలమయ్యా స్వామి ? గాంధీజీ కంటే నీవు గొప్పవాడివా ? ఆయన గోచీ విలువైనా నీ కున్నదా ? కుల, మత, దేశ, కాల పరిజ్ఞానమే లేని ఈ పసివాణ్ణా చితగ్గొట్టమంటున్నావు? ఇంత కాలంగా వేదమాతను చితగ్గొడుతున్నావు, చాలదా ? ఇక ఓర్చుకోలేకనే - వివేకానంద, దయానంద, రామమోహనరాయ్, వేంకటరత్నం నాయుడు, గాంధీ, అంబేడ్కరు, జగజ్జీవనరాం, వీరేశలింగపంతులు, వెంకటశర్మ లాంటి యోధుల్ని తయారు చేసి పంపుతున్న దా తల్లి ! వేదాలను దాచిపెట్టి సోమకాసుర సంతానం కాకు ! గుర్తుపెట్టుకో ! వైఖరిమార్చుకో, ప్రపంచానికి ఆధ్యాత్మిక భిక్షపెట్టిన ఆర్యమతాన్ని బ్రతకనీ! వేదమాతకు బాసటగా నిలు ! ఆచార మూఢుడవైతే, జ్ఞానకాంతిలో సర్వమానవ సామ్య ధర్మాన్ని గుర్తించలేని అంధుడవైతే, ఆధ్యాత్మిక పెత్తనంనుంచి వైదొలగు ! ఇప్పటికే సగం చచ్చివున్న భారతజాతిని, ఇంకా చావ గొట్టడానికి మాయామర్మం తెలియని ఈ పసిగుడ్డు సాకుగా దొరికాడా నీకు ? (కంటగింపుగా ముఖం త్రిప్పేసుకుంటాడు.)

బంగారంగారు

(మాడిపోయిన ముఖం, పూడిపోయిన గొంతుతో) హూ ! నీ వొకడివి అవతరించా విప్పుడు-- ఉద్ధరించడానికి ! (రుస రుస లాడుతూ నిష్క్రమిస్తాడు.)

పంటతల్లి

ఆ సంగతి కొత్తలంక యోగి కూడా చెప్పాడు.

(స్వాములవారు, బంగారంగారి దారికేసి క్షణకాలం తీవ్రంగా చూచి, ప్రసన్నవదనంతో తక్కినవాళ్ళకేసి తిరిగి చిరునవ్వు నవ్వుతాడు. వాతావరణం సౌమ్య మవుతుంది. దూరం నుంచి "మృత్యుంజయుడొక శివుడేరా" అంటూ, పాట వినవస్తున్నది. మెల్లగా తెరపడుతుంది.)

# బాలయోగి

## అంకం ఆరు

(అర్ధరాత్రి, కొబ్బరితోట. ఒక అపూర్వమైన పాలరంగు కాంతి రంగంలో వ్యాపించి వుంది. ఆ కాంతిలో ప్రవేశించాడు సుబ్బారావు. ఏదో ఒక అపూర్వానుభూతితో గంభీరంగా వున్నాడు. పగలంతా నిద్రపోయే అతని కళ్ళు సరసీరుహాల్లా విప్పారి దేనికోసమో వెతుకు తున్నై ! కథకుని కథనం ప్రకృతితో పాటు సుబ్బారావు మనస్థితికి, వర్తనకు లయ కలుపుతున్నది. )

### కథకుడు

అర్ధరాత్రి, నిరామయమైన ప్రకృతి. చల్లని గాలి వీస్తున్నది. కొబ్బరాకులు రెపరెప లాడుతున్నై. అక్కడొక గుడ్లగూబ, ఇక్కడొక తపసి పక్షి – ఏవో సంకేతాలు పలుకుతూ నిశాపాలన చేస్తున్నై. దినంచర వర్గం డ్యూటీ నుంచి దిగిపోగా, రాత్రించర వర్గం డ్యూటీపై కెక్కినట్టుగా ఉంది – రాత్రి ప్రకృతితీరు. కొబ్బరి బొండాలను ఎలకలో, ఉడతలో పటపటాడిస్తున్నై, అక్క డొక పిల్లి దురాక్రమణ, ఇక్కడొక ఎలుక శరణాగతి, ఎక్కడో ఒక పాము బుస, ఒక నక్క ఊల, కీచురాళ్ళ గోల – సగం ప్రకృతి మేలుకునే వున్నది. ప్రక్క పంటకాలువలో చిరుకెరటాల చిన్నారుల ఏవో ముచ్చట్లు. దూరంలో సముద్రుడి చప్పట్లు. వాటి కనుగుణంగా అదిగో ఏదో ఆలాపన. అది సుబ్బారావు భావలయకు బాహ్య రూపమేమో ! అతడి మనస్సు పరిపరివిధాల పోతున్నది. పశువులు, మనుషులు, సమాజం, దుఃఖాలు, బాధలు – తాను ! తా నెవరో! పనీ తిండీ – అంతేనా జీవితం ? బంగారంగారు, స్వాములవారు – ఈ ఇద్దర్నీ నిర్మించిన శిల్పి ఒకడేనా ? ఎందుకు నిర్మించినట్టు ? కోటి భూగోళాల గందరగోళంతో నిండివుంది సుబ్బారావు మనోవీథి! పసివాడు – ఒక్కడూ – ఆ భయంకర నిశీధంలో – తల్లిగర్భంలో శిశువులా తిరుగుతున్నాడు మౌనంగా! అతడి ఆలోచనలే ప్రకృతిలో ప్రతిధ్వనిస్తున్నట్లుగా వినవస్తోంది – ఒక పాట.

(అప్పటికే వినవస్తున్న ఆలాపన పాటగా రూపొంది వినవస్తున్నది. అది సుబ్బారావు మనస్థితికి సాహితీ దర్పణంగా వుంది.)

లోపలినుంచి

ఎందుకు వచ్చితివోయీ ? ఇది
గందరగోళపు జగమోయీ !
మనిషిని మనిషే తినివేసే, ఈ
మహితో పని యేమోయీ !
మార్కండేయుడు గెలిచిన మృత్యువు
మనుజుని యెదలో దాగినదోయి !
ప్రణయామృతమో, పరమయోగమో
పంచి, నరుని రక్షింతువటోయి ?

(సుబ్బారావు చాలాసేపు అలా అలా తిరిగి, అలసి, ఒక కొబ్బరిచెట్టు క్రింద కూర్చున్నాడు - చెట్టుకు జేరబడి, కన్ను లరమోడ్చాడు. ఆ చెట్టు మట్టలో నుంచి ఒక అందమైన తెల్లత్రాచు, అతడి శిరస్సుపై పడగ విప్పి, గొడుగు పట్టింది. అతడు కలగన్నాడు. కల కరిగిపోయే వరకూ ఆ నాగు అతడికి గొడుగు పట్టే వుంది. అతడి స్వప్నం రంగంమీద ఛాయా దృశ్యంగా కనిపిస్తుంది. సాంబ్రాణి పొగ తెల్లని కాంతితో కలిసి రంగం నిండా వ్యాపించింది.)

కథకుడు

సుబ్బారావు కలగంటున్నాడు. అది ఆకాశ గంగాతీరం. గోలోక పరిసరాలు. కామధేనువుల మందల్ని కాస్తున్నారు - నలుగు రైదుగురు కుర్రవాళ్ళు. ఆ కామధేనువులే సమస్త లోకాలకు ఓజస్సును సమకూరుస్తున్న జీవధాతువులు ! ఆ కుర్రవాళ్ళలో బాలకృష్ణుడు, ధ్రువుడు, మార్కండేయుడు, ఋష్యశృంగుడు మొద లైన వారున్నారు. కృష్ణుడితో రాధ కూడా ఉంది. ఎక్కడినుంచో వస్తున్న ఒక అమృత గానాలాపనకు లయభూతంగా,

నాట్యం చేస్తున్నారు వారంతా. ఆ గానానికి ఉపాధిభూతమైన పాట కొంత స్పష్టంగానే వినిపిస్తున్నది. ఇదంతా సుబ్బారావు నిమీలిత నేత్రుడై చూస్తూ, ఆనందిస్తున్నాడు. మాలక్ష్మి తన ప్రక్కనే నిలబడి వుంది - వాళ్ల ఆట పాటలు చూస్తూ !

(పాట, పాటకు ఆట, కొనసాగుతై రంగం మీద)

**లోపలినుంచి**

గోవుల గాసేవో ?
గోళీ లాడేవో ?
**గోదా తీరపు బీడులలో !**
**గోవుల గిట్టల గుంటలలో !**
**పాటలు పాడేవో ?**
**ఆటలు ఆడేవో ?**
**పాటలలో, ఆటలలో మునిగి**
**పని పాటులు మరిచేవో ?**
**అమృతము పితికేవో ?**
**ఆత్మను సాకేవో ?**
**గోళీ ఆటల గుంజాటనలో**
**గోవులనే వదిలేసేవో ?**

(ఈ ఆటపాటల మధ్యలో, ఎవరో ఒకరు సుబ్బారావు దగ్గరకు రావడం, అతణ్ని తమతో కలిసి ఆడుకోవడానికి సైగలతో పిలవటం, చేయి పట్టుకు లాగడం జరుగుతుంది. తర్వాత ఎవరో మరీ బలవంతం చేయగా, అతడు లేచి వాళ్ళతో కలుస్తాడు. వాళ్ళలో ఒకడై ఆడతాడు. గోవులన్నీ వాళ్ల చుట్టూ చేరినై ! వాళ్ళ ఆట మంచి రసకందంలో ఉండగా - ఎక్కడి నుంచో ఒక పర్వతం లాంటి నల్లని దున్నపోతు వాళ్లపైకి దూకింది. యమపాశపు ఝుళిపింపువలె మెరుపురేఖలు భయంకరంగా జిగేలు మంటున్నవి. క్షణం విభ్రాంతి ! రంగ స్తంభం ! అంతలో సుబ్బారావు చేతిలోకి ఎలావచ్చిందో గొడ్లకర్ర. దాన్ని ఎన్నడూ అతడు ఉపయోగించి వుండలేదు. అప్పుడు ఉపయోగించాడు. దున్నపోతు

ముక్కుదూలంపై ఒక్కదెబ్బ కొట్టాడు ! కుప్పగా కూలిపోయిందది. చీకటి కుప్ప ! విచ్చిపోయింది ! విరిగిపోయింది ! లేకుండా పోయింది ! అంధకారం అలా అదృశ్యమైపోగా, అరుణోదయమయింది. కుర్ర వాళ్ళంతా, రాధతో సహా, ఒక్కరొక్కరే సుబ్బారావులో కలిసిపోయారు. గోవులన్నీ కలిసి పోయాయి. పాట పాడుతున్న నారదుడు కూడా వచ్చి కలిసిపోయాడు. అత డొక్కడే మిగిలాడు!)

కథకుడు

బాల కృష్ణాదులు, రాధ, గోవులు, నారదుడు, సమస్త విశ్వము, ఆడుతూ, పాడుతూ సుబ్బారావులో కలిసిపోగా, అత డొక్కడే మిగిలాడు – నిర్వికల్ప పరబ్రహ్మ వలె !

**రాధ, కృష్ణుడు, పశులు, నారదుడు వరుస**
**ఎల్ల విశ్వము తనలోన నిమిడిపోవ,**
**వెలుగు నిర్వికల్ప బ్రహ్మ విధముతోన**
**సుప్రభాత లలాటుడై సుబ్బారావు !**

(సుబ్బారావు కళ్ళు తెరిచాడు. లేచి కూర్చున్నాడు. సూర్యోదయ మవు తున్నది. పొగ తగ్గింది. ఎదురుగా గంగయ్య, చాలమంది జనం ప్రవేశించారు. అంతవరకు తన పడగతో గొడుగు పట్టిన నాగు అప్పుడే వెనక్కు పోతూ వుండగా – వాళ్ళంతా భయంతో కంపించారు. సుబ్బారావు లేచి నిలబడ్డాడు. కాని, విపరీతమైన పరధ్యానంలో ఉన్నాడు. గంగయ్య భుజం మీద వాలిపోయాడు. లోపలి నుంచి పద్యం వినపడుతూ వుండగా, తెర వాలుతుంది.

లోపలినుంచి

**ఎవరు వెలుపల ? లోపల ఎవరు తలప ?**
**ఎవరు తనవారు ? పెరవార లెవరు ధరణి ?**
**తనకు, రాధకు మధ్య బాంధవ్య మేమి ?**
**ప్రాణ మొక టన్న జ్ఞానమే బ్రహ్మ తాను !**

# బాలయోగి

## అంకం ఏడు

(దృశ్యం : శూన్యం. చెట్టు చేమలు ఏమీలేవు. అది ఎవరికీ చెందని పుంత. పైని ఆకాశం. క్రింద భూమి. చుట్టూ దిక్కులు. రంగములో ఒక్క కాంతి తప్ప మరేమీ లేదు. ఉదయవేళ. అప్పుడే సూర్యుడు లోకంకేసి తొంగి చూస్తున్నాడు. ప్రకృతి ఉత్తేజంగా ఉంది. సుబ్బారావు యోగాసనంలో కూర్చుని ఉన్నాడు. బాహ్య ప్రపంచ స్మృతి లేదు. యోగ నిద్రలో ఉన్నాడనవచ్చు. అతడికి ఎదురుగా దూరంగా, గంగయ్య కళ్లొత్తుకుంటూ నిలబడి వున్నాడు. పరుగెత్తుకుంటూ పంటతల్లి వచ్చి, చకితురాలై నిలబడిపోయింది. ఎక్కడి నుంచో ఒక అమృతగానం రంగ ప్రారంభం నుంచీ వినిపిస్తూనే వుంది.)

లోపలినుంచి

జో ! ఓ జో ! ఓ జో !
జోజో, శివబాలా ! జో !
నీ మెలకువయే జగముల నిదుర,
నీ నిదురయె లోకాల జాగృతి !
నిదురించర ఈ తెలి దామరపై !
కదిలించర మము జ్ఞానరథముపై !
జో– ఓ జో– ఓ జో !
జోజో ! శివబాలా ! జో!

(ఏమీ అర్థం కాక గంగయ్య తికమక పడుతున్నాడు. అప్పుడు రంగంలోకి వెంకన్న ప్రవేశించాడు. అతడు చాలా గంభీరంగా ఉన్నాడు.)

వెంకన్న సెట్టి

ఏం జరిగింది, గంగయ్యా ?

గంగయ్య

నాకేమీ అర్థం కావడం లేదు, బాబు ! ఏదైనా జబ్బో, ఏమిటో ! మొన్న గణపయ్యగారి కొబ్బరితోటలో కూర్చుంటే, ఇంటికి తీసుకుపోయాను. రోజంతా మగతగా పడి వున్నాడు. వారం రోజులుగా ఇదే మైకం. రాత్రి మళ్ళీ పారిపోయాడు. ఊరంతా వెతకగా ఇప్పుడీ పుంతలో కనిపించాడు. ఏం చేయాలో తోచడం లేదు, బాబు ! (కళ్ళొత్తుకుంటాడు.)

వెంకన్న సెట్టి

ఏదో ఒక గొప్ప విషయం జరుగబోతోంది, గంగయ్యా ! నువ్వేమీ కంగారు పడకు. మొన్న కొత్తలంక యోగి కూడా చెప్పాడు – ఈ మండలం పూర్వం ఒక ఋషి వాటిక అనీ, త్వరలోనే ఒక అపూర్వ సంఘటన జరుగబోతున్న దనీ ! ఏ పుట్టలో ఏ పాముందో చెప్పలేం. నువ్వు వెళ్ళి, ఒక పందిరి వేయించు. అక్కడ చెట్ల నీడ కూడా లేదు.

గంగయ్య

అలాగే, బాబూ !

(ఒక ప్రక్కకు నిష్క్రమిస్తాడు. రెండో ప్రక్క నుంచి దండాలు, జెండాలు వగైరా ప్రవేశిస్తారు.)

వెంకన్న సెట్టి

ఒరే, జెండాలు ! పండూని అలానే కూర్చోనివ్వండి. ఏమీ అల్లరి చెయ్యకండి. (నిష్క్రమిస్తాడు)

పంటతల్లి

(పండూని తట్టి చూచింది. కదిపి చూచింది) అంతా ఒక చిత్రం !

జెండాలు

(కదిపి చూచి) రాయిలా కూర్చున్నాడ్రా !

దండాలు

(ఊపి చూచి) ఒరే, పండూ ! తిండిమాని ఎంతకాలం ఉంటావురా, ఇలా !

జెండాలు

కోపం ఎవరి మీదో చెప్పరా ! మీ అయ్యమీదా ? మీ పిన్ని మీదా ? చెప్పరా! మేం మట్లాడుతాం ! అంతు తేలుస్తాం !

పంటతల్లి

అవేమీ కాదర్రా ! ఎవరి మీదో కోపగించి తిండి మానేశాడనుకుంటు న్నారా? ఓరి, నీ !

(ఆ దారిని పోతూ, బంగారంగారు ప్రవేశిస్తాడు.)

బంగారంగారు

ఏమిట్రా అది ? అలా కదులుతాడ్రా వాడు ? ఈడ్చుకు పోండోయ్, ఎందుకీ ఎండలో !

వెంకన్న సెట్టి

(ప్రవేశిస్తూ) ఎందుకండి, బాబూ ? మీ దారిన మీరు పొండి !

బంగారంగారు

కాదయ్యా, సెట్టి ! అలాంటి దొంగవేషాల్ని మనం సహించ గూడదు. నాగరిక లోకం మనల్ని మూర్ఖులనదూ ? పైగా ఒక వర్ణబాహ్యుడు –

వెంకన్న సెట్టి

మన మహర్షు లంతా వర్ణ బాహ్యులేనటక దండి, బాబూ ?

బంగారంగారు

నీక్కూడా ఎక్కిందీ తిక్క ? ఏదో దురదృష్టం పట్టిందీ ఖండానికి !

వెంకన్న సెట్టి

పోయిన అదృష్టం తిరిగి పట్టిందని స్వాములవా రంటున్నారు గదా ?

బంగారంగారు

హూ ! (కోపంగా నిష్క్రమిస్తాడు. వెంకన్న సెట్టి కూడ నిష్క్రమిస్తాడు.)

జెండాలు

ఎండ మాడేస్తోందిరా ! పోనీ, ఏ చెట్టునీడకో పోయి కూర్చుంటే ?

పంటతల్లి

ఎందుకర్రా ఈ మాటలన్నీ ? పండూకు ఇవన్నీ వినిపిస్తున్నాయా, ఏమన్నానా?

(రంగం హఠాత్తుగా చీకటై, క్షణంలో మళ్ళీ వెలిగింది.)

పోతురాజు

(ప్రవేశిస్తూ) ఎందుకురా, ఈ దొంగతంతు ? రెండు తన్నితే, దులుపుకొంటూ పరిగెత్తడర్రా ?

దండాలు

ఓరి, నీ ! ఏమన్నావ్ ?

పోతురాజు

వీడి కేదో దెయ్యం పట్టిందిరా ! దెబ్బకుగాని దెయ్యం వదలదు, తెలుసా?

దండాలు

ఓరి, నీ !

(రంగం మళ్ళీ చీకటై, క్షణంలో వెలిగింది)

పోతురాజు

వీడు తిండి మానాడనా ? వొర్రిది ! రాత్రిళ్ళు ఎవళ్ళూ చూడకుండా బాగా మెక్కి, పగళ్ళు ఇలా కూర్చుంటున్నాడ్రా ! లేకపోతే ఎవడన్నా వుంటాడట్రా కూడు తినకుండా ఇన్ని రోజులు ?

పంటతల్లి

(కోపంగా) అంత పచ్చిమోసం ఎందుకు చేస్తున్నాడంటావ్ ?

జెండాలు

ఉద్యోగాల కోసమా ? ఊళ్ళేలడం కోసమా ?

దండాలు

మీ ఖామందు మప్పా డేమిట్రా - ఈఈ అభివృద్ధి నిరోధక తత్వం ?

పోతురాజు

ఎన్నికల ప్రచారం కబుర్లు ఇక్కడ చెప్పకోయ్ !

దండాలు

మొన్న ఎన్నికల్లో మా గాంధీగారే గెల్చారోయ్ !

జెండాలు

ఇంకొక్క ఏడాదిలో స్వరాజ్యం - అంటే గాంధీ రాజ్యం వచ్చేస్తుందని కొత్తలంక యోగి చెప్పాడు లేరా !

పోతురాజు

వా డో పిచ్చోడు ! మా అత్తకు పిల్ల పుడతాదని విబూది ఇచ్చాడు. పిల్లా లేదు. పిల్లీ లేదు.

దండాలు

ఉప్పు పట్రరోయ్ ! ఉప్పు పట్ర !

పంటతల్లి

స్వాములవారు కూడా చెప్పారు– గాంధీరాజ్యం ఎంతో దూరంలో లేదని ! ఇది పందొమ్మిదివందల నలభై ఆరట ! పందొమ్మిదివందల నలభై ఏడులో స్వరాజ్యం వచ్చేస్తుందట. నేను విన్నాను.

(రంగం చీకటై వెలుగుతుంది. పందిరి కూడ వేసి వుంటుంది. అప్పుడు బంగారంగారు, మరికొందరితో వస్తాడు)

బంగారంగారు

ఓరి – వీడింకా ఇక్కడే వున్నాడట్రా ?

పోతురాజు

రెండు తన్నితే గాని –

బంగారంగారు

తన్నండట్రా ! లేచి పరిగెడతాడు !

(ఈ మాటలతో, బంగారంగారి కూడా వచ్చిన జట్టులో వాళ్ళు తలొకరాయి విసురుతారు. రంగం అల్లకల్లోల మవుతుంది. అంతలో వీరంబాబు పరుగు పరుగున – వీరోహం అని గర్జిస్తూ – అక్కడికి వచ్చాడు. పోతురాజును ఎత్తి గిరాటు వేశాడు. బంగారంగార్ని అవతల పారేశాడు. రంగం ఒక చిన్న యుద్ధరంగంగా తయారయింది. అంతలో సర్పం రంగంలో ప్రత్యక్షమై సుబ్బారావుకు పడగ పడుతుంది ! ఎక్కడి వాళ్ళు అక్కడ భయభ్రాంతులై ఆగిపోతారు ! అప్పటికి గంగయ్య, వెంకన్న సెట్టి వగైరా చాలమంది అక్కడికి చేరివున్నారు. రంగం అనేక వర్ణాల కాంతులతో ధగధగలాడిపోతుంది. అప్పుడు స్వాములవారు రంగంలో ప్రవేశించాడు.)

స్వాములవారు

(ప్రసన్నవదనలతో, ఆనంద దరస్మితంతో) నాయనలారా ! మనం అందరం ధన్యులం ! సుబ్బారావు కారణజన్ముడు ! ఒక ప్రయోజనం కోసం కైలాసం నుంచి భూలోకానికి పంపబడ్డ ప్రత్యేక రాయబారి అతడు. తనతో సహచరుడై వున్న భగవంతుణ్ని మానవుడు ఏనాడూ గుర్తించలేదు. అందులో మన దోష మేమీ లేదు. మానవ స్వభావమే అంత ! బ్రతికి వుండగా, ఒక మానవుడు మరొక మానవుణ్ని ఎన్నడూ గుర్తించడు ! శ్రీరాముడిపై నిందలు వేశారు. శ్రీకృష్ణుణ్ని తరిమి కొట్టారు. సోక్రటీసుకు విషం ఇచ్చారు. ఏసుక్రీస్తును శిలువ వేశారు. మహమ్మదుతో యుద్ధాలు చేశారు. మార్క్సును బహిష్కరించారు. గాంధీజీని హత్య చేశారు. ఎవరు ? వారి సహచరులైన మానవులే !

(రంగం చీకటై, వెలుగుతుంది.)

వెంకన్న సెట్టి

మానవుడు తనతో వున్న మహేశ్వరుణ్ణి ఎందుకు గుర్తించడం లేదు ?

స్వాములవారు

ప్రతి మానవుడి లోను మహేశ్వరుడి అంశ వుంది. ప్రతి అంశకూ ఒక అహంకారం వుంది. ప్రతి అంశకూ - తనతో సమానమైన అంశం పట్ల వైరం ఉంది ! ఆ వైరమే విశ్వంలోని పోటీ పోరాటాల కన్నిటికీ కారణం ! ఒక నది పదికాలువలుగా చీలిపోతే - తక్కిన కాలువల్ని అరికట్టి తాను నది కావాలని, అందులో ప్రతి కాలువా ప్రయత్నిస్తుంది. తన నుంచి చీలిపోయి తనను బలహీనపరుస్తున్నా యనీ, తన సంపూర్ణత్వాన్ని భంగపరుస్తున్నా యనీ, తక్కిన అంశలపై ప్రతి అంశా నింద వేస్తుంది. ఆత్మ ప్రాధాన్యం అదే. అదే స్వార్థం. అదే అహంకారం. ప్రాధాన్యంకోసం పోటీపడటంలో ఎవరూ ఎవరికీ తీసిపోరు. యుద్ధం తర్వాత కదా గెలు పెవరిదో తెలియడం ?

(రంగం చీకటై, వెలుగుతుంది. కాలం గడుస్తున్నది.)

స్వాములవారు

ఆధ్యాత్మిక సంబంధమైన అలాంటి ఒక మహాయుద్ధంలో గెల్చి, ఒక మహాయోధుడుగా నిల్చిన మహాయోగి నేడు ఈ సుబ్బారావు ! ఈతణ్ని ఇక నుంచి బాలయోగి పేరుతో పిలుస్తాం !

జనం

బాలయోగికీ జై !

(జయ జయ ధ్వానాలు మిన్ను ముట్టాయి)

స్వాములవారు

ఈ బాలయోగి ఆహార నిద్రలను, వాక్కును గెల్చిన మహాయోగి. అన్ని అనర్థాలకు మూలం అన్నం, దాన్ని గెలవడమే మహామహత్తు !

వెంకన్న సెట్టి

అన్నం పరబ్రహ్మ అన్నారు కదా ఋషులు ? మరి –

స్వాములవారు

అన్నం పరబ్రహ్మ స్వరూపమే. కాని అది మాయాస్వరూపం. ప్రకృతి స్వరూపం. పురుషుని సంసార సాగరంలో ముంచి వుంచుతున్న దదే. బ్రహ్మ నుంచి పుట్టిన అన్నం – తానే బ్రహ్మ అనిపించుకొంటూ – బ్రహ్మతో తాదాత్మ్యానికి అడ్డుగా నిలుస్తున్నది. దాన్ని జయించకుండా మోక్షం లేదు.

(రంగంలో చీకటి వెలుగులు)

గంగయ్య

మరి – వాక్కు ?

స్వాములవారు

లోకంలోని పేచీ లన్నిటికి మూలం వాక్కు. దాన్ని కూడా జయించాడు బాలయోగి. కర్మేంద్రియాలను, జ్ఞానేంద్రియాలను కూడా జయించి – ఆపాద మస్తకం తానొక జ్ఞానరాశి అయినాడు. నీడ లేని ఒక వెలుగురాశి ఇప్పుడతడు. ప్రపంచం కనీ వినీ ఎరుగని మహా తపస్సుకు పూనుకున్నాడు. నిర్వికల్ప సమాధి దానంతట అది సమకూడిందతడికి. అదే యోగనిద్ర. అదే బ్రహ్మానందం. అదే ప్రకృతి పురుషుల సంయోగ పారవశ్యం !

వెంకన్న సెట్టి

యోగం సాధన ద్వారా లభించేది కదా ?

స్వాములవారు

సాధారణంగా అంతే. కాని, కొందరికి జన్మతోనే వస్తుందది. కుండలిని దానంతట అదే మేల్కొని సహస్రారం చేరుకుంటుంది. "మైధునేన మహాయోగీ మమతుల్యో న సంశయః" అని పరమేశ్వరుడు చెప్పిన సిద్ధి అదే. ఈ సమస్త సృష్టి స్థితిలయాలకు క్రియా భూతమైన క్రీడ అది. బొంగరం తీవ్రవేగంతో తిరుగుతున్నప్పుడు అది అచలంగా వుండిపోయినట్లు కనిపిస్తుంది. అలానే తీవ్ర క్రియావేగి, ఈ నిద్ర. సమస్త విశ్వ వ్యవహారాలనూ పాలించే వ్యవస్థ అది. అట్టి మహామహితాత్మక పరాస్థితిని అందుకొన్నాడు బాలయోగి ఈనాడు !

వెంకన్న సెట్టి

మరి – కైలాసం నుంచి భూలోకానికి పంపబడ్డ ప్రత్యేక రాయబారి అన్నారుకదా! అదేమిటో –

స్వాములవారు

అది ముందు ముందు మీకే తెలుస్తుంది. కేవలం తిండీ, పుష్టీ, మాట నేర్పూ మాత్రమే రాజ్య మేలుతున్న ఈ భౌతికయుగంలో, రెంటినీ జయించే ఒక ఆధ్యాత్మిక

శక్తిని ప్రదర్శించి చూపగలగటం సామాన్య విషయమా ? కులతత్వంతో కుళ్ళిపోతున్న ఈ దేశంలోనే, ఆ కుళ్ళునంతా భరిస్తున్న ఈ కులంలోనే, ఈ మహనీయుడు జన్మించడం ప్రయోజనాత్మకం కాదా ? ఇది శివలీల. దీని అద్భుత మహాత్మ్య ప్రదర్శనను మనం కనులారా చూచి, మనసారా ఆనందించి, ఆత్మారా తరించబోతున్నాం ! ఇక నుంచి ఇదే కైలాసం మనకు ! ఈ మహా యోగి సేవే తరణం మనకు !

**గంగయ్య**

బాగా ఎండెక్కింది. నాగేంద్రుడి పడగ నుంచి చెమట బొట్లు రాలుతున్నై.

(రంగం నిండా చీకటి ఆవరించి మెల్లగా వెలుగు వచ్చింది. నాగు పడగే పందిరిగా వెలిసింది. బాలయోగి పరమయోగముద్రితుడై వున్నాడు.)

**వీరంబాబు**

ఓహో ! పడగే పందిరి అయింది ! మనం వేసిన పందిరి మాయ మయింది.

**పంటతల్లి**

మందిరమే అయింది. ఓహో, దేవాలయమే అయింది !

**బంగారంగారు**

(ఎదరకు వచ్చి) ఈ తంతు అంతా ఏమిటో, ముందు దర్యాప్తు జరగాలి:

**పోతురాజు**

పోలీసుకు రిపోర్టు ఇవ్వాలి.

**స్వాములవారు**

(చిరునవ్వుతో) అన్నీ జరుగుతై, నాయనలారా ! ముందుగా దర్యాప్తే జరుగుతుంది. పోలీసులు వస్తారు.

దండాలు

(ఉలిక్కిపడి) అమ్మబాబోయ్, పోలీసులే !

పంటతల్లి

దొంగతనం చేసినవాడిలా, ఎందుకురా ఆ భయం !

జెండాలు

దొంగతనమే చెయ్యక్కరలేదే ! గాంధీగారి పేరెత్తినా తన్నుతారు వాళ్ళు.

గంగయ్య

దొంగలా కూర్చున్నావేంరా – అని తంతారేమో, బాబూ !

స్వాములవారు

అలాంటి దేం జరగదు. ఆ రోజులు పోయినై. అన్ని దర్యాప్తులు, అన్ని నిగాలు, అన్ని పరీక్షలు జరుపుతారు. జరుపకుండా ఉండలేరు మానవులు. అలా జరగడమే మంచిది. వజ్రానికి సాన అవసరం. ఏ విధమైన వికాసానికైనా సరే, మైత్రి కంటే వైరమే ఎక్కువగా తోడ్పడుతుంది. సానకు భయపడేది గులకరాయి, వజ్రం కాదు. ఎప్పుడూ, ఎందుకూ, ఏ విధంగానూ భయపడకండి. మన మందరమూ బాలయోగి తపోమార్గంలో ఉపలాలక సాధనాలం. ప్రతి సాధనానికి ఒక పని ఉంటుంది. పని ముగిసిన సాధనాలు పోతూ వుంటై. బాలయోగి రక్షణను, పోషణను జగన్మాతే స్వీకరించింది. ఆ తల్లి జటనుంచి జారిన మల్లెపూల మాలే ఈ పడగపట్టిన సర్పం ! ఈ క్షేత్రాభివృద్ధి కార్యక్రమాలను అధికారులే నిర్వహిస్తారు. బాలయోగి సంకల్పమే సమస్త కార్యాలను నడిపిస్తుంది. మన మందరం కేవల నిమిత్తమాత్రులం. మీమీ మనస్సులకు ఎలా తోస్తే అలా నడుచుకోండి. ఈ మాటలు నాచేత పలికిస్తున్న వాడు బాలయోగే. అతని ఈ యోగనిద్ర ఎంతవరకో, అవతార ప్రయోజన సిద్ధి ఎప్పటికో, ఎవరికీ తెలియదు.

అదొక సంతత నిరంతరానంద సిద్ధి. అదొక నిత్య నూతన జీవామృత వరప్రసాద క్షేత్రం. (చేతులు జోడించి) ఓం నమశ్శివాయ ! నమో బాలయోగీంద్రాయ ! ఆత్మోద్ధారకాయ నమోనమః !

(ఘంటానాదం వినిపిస్తుంది. రంగం బాలయోగీంద్ర స్తుతితో ప్రతిధ్వనిస్తుంది.)

**ఓం నమశ్శివాయ,**
**నమో బాల యోగీంద్రాయ,**
**ఆత్మోద్ధారకాయ నమోనమః !**

**కథకుడు**

ఓహో ! బాలయోగి దివ్యదర్శనం ! సాక్షాత్తు శివస్వరూపుడైన బాలయోగి మహాయోగి అయినాడు. సత్యం, సుందరం, శివం అయిన మహాశివరాత్రి మన కిచ్చిన మహావైభవం !

**సత్య సుందర శివ మహా సౌప్రభాస**
**భాసమానుడు నేడు శ్రీ బాలయోగి !**
**దర్శనము చేసుకొని యిక ధన్యు లగుదు !**
**బాలయోగి అబాలగోపాల యోగి !**

(రంగంలో అనేక రంగుల కాంతుల మధ్య, బాలయోగి మహాయోగిగా భాసిస్తాడు. ప్రసంగం తర్వాత స్వాములవారు జనంలో కలిసిపోయాడు. జనం లక్షలలో ఉన్నారు. స్వాములవారు, బంగారంగారు, వెంకన్న సెట్టి, గంగయ్య, వీరంబాబు, పంటతల్లి, వెర్రమ్మగారు, మాలక్ష్మి, దండాలు, జెండాలు, పోతురాజు - లక్షల జనం ! అది శివరాత్రి ! రంగంలో కాంతులు మారి మారి, ఒక పాలవెన్నెల కాంతి బాలయోగిపై పడుతుంది. తీర్చిదిద్దిన జటాజూటంతో, అంతస్తులుగా వున్న అనంతుని ఒక పడగనీడలో, శిరోమండలం మీద - చక్రాకృతిలో - జగచ్ఛక్రాన్నే పాలిస్తున్నట్టున్న రమణీయ కాంతితో అపర శివుడులా వున్నాడు బాలయోగి - పద్మాసనంపై యోగ ముద్రతో ! జనం చేతులు మోడ్చి, తన్మయులై స్తుతించసాగారు - ఘంటా నినాదాలమధ్య)

ఓం నమశ్శివాయ,
నమో బాల యోగీంద్రాయ,
ఆత్మోద్ధారకాయ నమోనమః !

కథకుడు

గోలోక గంగతో గోదావరీ గంగ చేతులు కలిపి నాట్యం చేస్తోంది - ఆనందంతో! రోదసినుంచి అమృతాలాపన సంకీర్తనంగా భూమండలం మీదకు ప్రవహిస్తూ, భక్తజన హృదయాలను పునీతం చేస్తోంది - బాలేందు కాంతితో, పారిజాత పరిమళంతో !

(సంకీర్తనంలో కథకుని కంఠం కలిసింది. శివరాత్రి భక్త కోటి కంఠాలు మేళవించినై. బృందారకుల బృందగానంగా భూనభోంతరాళాలలో భాసిస్తున్న దీ బాలయోగి శివరాత్రి మహా సంకీర్తనం.)

సంకీర్తనం

ఆకాశ గంగతో అభ్యంగ మొనరించి,
పమిట చెరగుల తోడ తమిమీర తడులొత్తి,
ఉడులోకముల వెలుగు పొదు లలది, ప్రతిప్రొద్దు
లక్ష్మీ సరస్వతులు లాలింత్రు నిన్ను !

బాలయోగీ ! యోగ బాలోప భోగి !
అందుకోవయ్య, మా ఆత్మోత్పలములు !

సురవన సుమాల అత్తరులతో తల దువ్వి
నెలవంక ముడిచి, పాముల కండవా చుట్టి,
తండ్రి వాలక మెట్లు తప్పునని శివు నెంచి,
ముదముతో జగదంబ ముద్దాడు నిన్ను !

బాలయోగీ ! యోగ బాలోప భోగి !
అందుకోవయ్య, మా ఆత్మోత్పలములు !

తన పసితనమునాటి తానె కాబోలు నను
కొని, కాళి చూడ వచ్చిన గుట్టు చెదునంచు,
పాములను పుట్టలకు పారదరిమే శివుదు
తెలివొంది, నవ్వుకొని, దీవించు నిన్ను !

బాలయోగీ ! యోగ బాలోప భోగి !
అందుకోవయ్య, మా ఆత్మోత్పలములు !

బాల సూర్యుని దీప్తి, బాలచంద్రుని కాంతి,
బాలకృష్ణుని గీతి, పరమమున యోగించి,
బాలయోగిగ నీవు ప్రభవించినావు !
ఆత్మ పారమ్యమును ఆర్జించినావు !

బాలయోగీ ! యోగ బాలోప భోగి !
అందుకోవయ్య, మా ఆత్మోత్పలములు !

యోగాసనమున నీ వుందు నదియే గుండె
ధ్యాన మందున నిన్ను ధరియించునదె బుద్ధి,
ఆనందమున నీతొ ఐక్యమౌనదె ఆత్మ,
నీ పూజె శివరాత్రి ! నీ దర్శనమె శివుడు !

బాలయోగీ ! యోగ బాలోప భోగి !
అందుకోవయ్య, మా ఆత్మోత్పలములు !

(మెల్లగా తెర జారుతుంది)

సమాప్తం

* * *